# జనపదం

J A N A P A D H A M

హైదరాబాద్ | సోమవారం 23 సెప్టెంబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 105

తెలుగు దినపత్రిక


## జార్ఖండ్ టు హైదరాబాద్..



- రాజధానిలో బయటపడ్డ ఉగ్రమూలాలు
- గత నెలలో ఢిల్లీలో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది రిజ్వాన్ అబ్దుల్ అరెస్ట్
- ఐసిస్ పుణే మాడ్యూల్‌లో పని చేస్తున్న రిజ్వాన్
- కొన్ని నెలలు పాటు ఉన్నట్లు నిర్ధారణ
- సైదాబాద్ లోని శంఖేశ్వర్ బజార్ గ్రీన్ వ్యూ అపార్ట్ మెంట్ లో ఎన్ఐఏ సోదాలు

3



## ఎంఐఎం స్థావరంలోనే ఉగ్రవాదం..

- పోషిస్తున్నది ఆ పార్టీయే..
- ఓవైసీ కాలేజీలో ఫ్యాకల్టీ ఉగ్రవాదిగా పట్టుబడ్డాడు..
- వన్ నేషన్ వన్ ఎలక్షన్ కు కట్టుబడి ఉన్నాం..
- తిరుపతి లడ్డు కల్తీ హిందూ ధర్మంపై దాడి..
- కేటీఆర్ కు మీడియా ఫోబియా..
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

2



## పోలీసులమంటూ కోటి టోకరా..

- మనీ ల్యాండరింగ్ నుంచి బయటపడేస్తానని మోసం..
- తెలివిగా వసూలు చేసిన సైబర్ మోసగాడు...
- రామగుండంలో ఘటన...

4



## నాలుగు రోజులు భారీ వర్షాలు..

### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్..

**జనపదం, బ్యూరో:** బంగాళాఖాతంలో రెండు ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం అల్పపీడనంగా ఏర్పడే అవకాశం ఉందని, దీంతో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ కూడా జారీచేసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు చెప్పింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడుతాయని, మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది.



## దారుణం..

- ట్రావెల్స్ బస్సుల్లో మహిళపై లైంగికదాడి..
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

### తిరుపతిలో బాలికపై కామాంధుడు..

- ఎనిమిది నెలలుగా అఘాయిత్యం..

2





- పేదల కన్నీరుమున్నీరు..
- కోడలు గర్భిణీ కనికరించండి..: ఓ మహిళా ఆవేదన
- రోడ్డున పడిన సామాన్యులు..

### దూకుడు పెంచిన హైడ్రా..

- అర్ధరాత్రి వరకు హల్ చల్..
- ఆదివారం 44 ఆక్రమణల కూల్చివేత
- 8 ఎకరాలు స్వాధీనం..

# ఉసురు తాకిపోతవ్..

"నువ్వేదో చేస్తవని ఆశపడితే కొంపలు గూల్చి బజార్నేసినవ్. నిన్ను నమ్ముకున్నందుకు మంచిగనే బుద్ధి చెప్పినవ్. మా బతుకులు మొత్తం మట్టిపాలు చేసినవ్. మా ఇండ్లు కూల్చిన నీ సర్కార్ కూడా తప్పకుండా కూలుద్ది. నువ్వు ఎక్కువ రోజులు ఉండవ్. ఉసురుతాకి తప్పకుండా పోతవ్..." అని పేదలంతా శాపనార్థాలు పెట్టారు. సీఎం తీరును అసహ్యించుకుంటూ దుమ్మెత్తిపోశారు. కనీసం గర్భిణీ., ఆడవారు అనే కనికరం కూడా చూపకుండా అధికారులు ప్రదర్శించిన దూకుడు తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఎక్కడికక్కడ సామాన్లు చెల్లాచెదరు చేస్తూ, అడ్డం వచ్చిన వారిని లాగేస్తూ హైడ్రా అండ్ టీమ్ చేసిన బీభత్సం కాంగ్రెస్ సర్కార్ పై ఆగ్రహావేశాలకు తావిచ్చింది. బడా బాబులకు సమయమిస్తూ, కనీసం తమగోడు కూడా చెప్పకుండా, సర్దుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ప్రభుత్వం చేసిన అతిని బాధితులంతా తిట్టిపోస్తున్నారు.

## రేవంత్‌కు బాధితుల శాపనార్థాలు..

జనపదం, బ్యూరో

హైడ్రా కూల్చివేతలు పేదోళ్ల పొట్ట గొడుతున్నవి. తిండి తిప్పలు మాని, ఆరు గాలం శ్రమించి పైసా పైసా కూడబెట్టుకొని కట్టుకున్న ఇల్లు కండ్ల ముందే నేలమట్టం అవుతుంటే పేదోళ్ల కన్నీళ్లు వరదలై పారుతున్నాయి. సమయం.. సందర్భం లేకుండా దూసుకొస్తున్న బుల్డోజర్లు వారి జీవితాలను చెల్లాచెదురుచేస్తున్నాయి. తాజాగా ఆదివారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో హైడ్రా కూల్చివేతలతో కూకట్‌పల్లి, అమీన్‌పూర్ ప్రాంతాలన్నీ గరీబోడి ఆవేదన, రోదనలతో ప్రతిధ్వనించాయి. ఇంత అన్యాయమా రేవంత్ రెడ్డి...? మీరు వస్తే బాగుంటుందని నేను కూడా మీకు ఓటేసిన. కానీ, ఇట్లా చేస్తావనుకోలే. సామాన్లు తీసుకునేందుకు మాకు కొంత టైం ఇవ్వండి. మా కోడలు ఐదు నెలల గర్భవతి, ఉన్నఫళంగా వెళ్లమంటే ఎక్కడికి వెళ్లాలని.... ఓ మహిళ బోరున విలపిస్తూ ప్రభుత్వాన్ని వేడుకున్న దృశ్యం ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది. నిరాహార దీక్ష చేసి కేసీఆర్ నిరుపేదలకు ఇండ్లు కట్టిస్తే.. అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి పేదలను పీడిస్తున్నారంటూ.. బాధితు లు గగ్గోలు పెట్టారు. తమ బతుకులు రోడ్డుపై పడుతున్నా ముఖ్యమంత్రి కనికరించడం లేదని కన్నీరుపెట్టుకున్నారు.

### 44 అక్రమ నిర్మాణాల నేలమట్టం..

ప్రభుత్వ స్థలాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నివాసాల కోసం నిర్మించుకున్న భవనాలను కాకుండా వ్యాపారం కోసం నిర్మించిన వాటిని మాత్రమే ......(తరువాయి 2లో)



## పొంగులేటి నాతో రా..

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దగ్గరకు వెళ్దాం...
- వావి, వరసలన్నీ తేల్చుకుందాం..
- రేవంత్... నీ పోస్టు ఊస్టే..
- రెడీగా ఉండు.. పనైపోయినట్లే..
- పీకించేంది ముమ్మాటికి పొంగులేటే..
- మాజీ మంత్రి కేటీఆర్..
- అమృత్ పై ముదురుతున్న వివాదం..
- బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం..

జనపదం, హైదరాబాద్ సిటీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవినీతిపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమృత పథకంలో తాను ఆరోపించిన విధంగా అవినీతి జరగలేదని తేలితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం కాదు., రాజకీయ సన్యాయం తీసుకుంటానని కేటీఆర్ సవాల్ విసిరారు. తనపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపైన ఘాటైనా కౌంటర్ ఇచ్చారు. రేవంత్ ను మంత్రి పొంగులేటి ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. ఈ విషయంలో ఆయన రాజీనామా చేయాల్సిన అవసరం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ నే రాజీనామా చేయాల్సి వస్తుందని కేటీఆర్ జోస్యం చెప్పారు.

### దగుల్బాజీలు...

రాజీనామా చేయాల్సిన దగుల్బాజీలు ఈ ముఖ్యమంత్రి ఆయన మంత్రులే అని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ మంత్రులకు చట్టాలు మాత్రమే కాదు, చుట్టరికాలు కూడా తెలిసినట్టు లేదని ఎద్దేవా చేశారు. భార్య తమ్ముడు బావమరిది కాకుండా ఇంకేమి అవుతాడో పొంగులేటి ......(తరువాయి 2లో)

## సేవ్... దామగుండం..

- దామగుండం మరో రామగుండం అవొద్దు
- సేవ్ నల్లమల తరహాలో కాపాడుకుందాం
- నేవీ రాడార్ ప్రాజెక్టుని అడ్డుకుందాం..
- ధర్నాలో పర్యావరణ వేత్తల పిలుపు
- చిప్కో మూమెంట్ తరహాలో దామగుండం
- త్వరలో ఉద్యమ కార్యాచరణ

2

- ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ మయం..
- 27 రోజుల్లో రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే..
- ఎమ్మెల్యేలు దూకుడు తగ్గించుకోవాలి..
- ప్రజలకు అందుబాటులో ఉండాలి..
- సీఎల్పీ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



# ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇస్తాం..

జనపదం, హైదరాబాద్

త్వరలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు అందజేస్తామని, ఈ కార్డు ఆధారంగానే ఫ్యామిలీకి సంక్షేమ పథకాలు అందుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ప్రతి ఫ్యామిలీకి డిజిటల్ కార్డు ఇవ్వబోతున్నామని, దానితో సంక్షేమ పథకాలు సక్రమంగా పంపిణీ జరుగుతుందన్నారు. దీంతోనే రాష్ట్రంలో ఎక్కడున్నా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా తన ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని, లోక్ సభ సీట్లు గెలిచామన్నారు. మహేష్ కుమార్ గౌడ్ ను తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కి ధన్యవాదాలు తెలుపుతు సీఎల్పీ ఏకగ్రీవ తీర్మానం చేసింది.

### సమన్వయంతో..

పార్టీ నాయకత్వం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు వెళ్లాలని, ప్రజల్లో ఉన్న వారికే జిల్లా అధ్యక్ష పదవులు ఇవ్వాలని పీసీసీకి సూచించారు. పార్టీ అనుబంధ విభాగాల్లో పనిచేసిన 36 మందికి నామినేటెడ్ పోస్టులు ......(తరువాయి 2లో)

## అమ్మదొంగా..?!



- గాంధీ.. ఇదేంది..?
- సీఎం దినికేమంటారు...?
- సీఎల్పీ భేటీకి అరికెపూడి..
- బయటపడిన బండారం..

### దొంగ దొరికాడు..

- ఇప్పుడేం చెబుతారో..?
- ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పాల్సిందే..:
- రేవంత్‌కు మాజీ మంత్రి హరీష్ సూటి ప్రశ్న

2

### మర్యాదపూర్వకంగా కలిశాడు..: మంత్రి శ్రీధర్ బాబు

## మెగా డ్యాన్సర్..

- 'చిరు'కు మరో కిరీటం
- గిన్నిస్ బుక్‌లో ప్లేస్
- అత్యధిక డ్యాన్స్ స్టెప్పుల రికార్డు..
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, సీఎం రేవంత్, మంత్రి కోమటి రెడ్డి, ప్రముఖుల అభినందనలు..

3



జనపదం, సినీ బ్యూరో

**కోట్లాది మంది** అభిమానుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించిన టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి తాజాగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించారు. చిరంజీవి తన 45 ఏళ్ల కెరీర్ లో 156 సినిమాల్లో నటించి, 537 పాటల్లో 24,000 డ్యాన్స్ స్టెప్పులు వేశారు. మరే నటుడూ ఇన్ని డ్యాన్స్ స్టెప్పులు వేసిన దాఖలాలు లేవు. 1978 సెప్టెంబరు 22న తన సినీ కెరీర్ ప్రారంభించిన చిరంజీవి భారతీయ ......(తరువాయి 3లో)

## ట్రావెల్స్ బస్సులో మహిళపై లైంగికదాడి..

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- తిరుపతిలో బాలికపై కామాంధుడు..
- ఎనిమిది నెలలుగా అఘాయిత్యం..



**జనపదం, హైదరాబాద్:** నగరంలో దారుణ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రైవేటు ట్రావెల్ బస్సులో వివాహితపై అత్యాచారం జరగడం కలకలం రేపుతోంది. సెప్టెంబర్ 18న జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగు చూసింది. అత్యాచార ఘటన ప్రయాణికులను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తోంది. ఈనెల 18న కూకట్‌పల్లి నుంచి విజయవాడ వెళ్లేందుకు ఓ మహిళ(28) ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎక్కింది. రాత్రి సమయం కావడం, అందరూ నిద్రిస్తుండడంతో అదే బస్సులో ఉన్న ఓ కామాంధుడు ఆమెపై కన్నేశాడు. మెల్లిగా ఆమె పక్కకు చేరాడు. అరిస్తే చంపేస్తానంటూ బలవంతంగా ఆమెపై అత్యాచారం చేశాడు. తనపై జరిగిన దారుణ ఘటనను ఇంటికి వెళ్లిన తర్వాత ఆమె భర్తకు చెప్పింది. అనంతరం వారిద్దరూ ఆదివారం చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. దీంతో అత్యాచార ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదు నిమిత్తం కేసు నమోదు చేసిన చౌటుప్పల్ పోలీసులు కూకట్‌పల్లికి బదిలీ చేశారు.

**ఏపీలో మరో ఘటన..**

తిరుపతి జిల్లా అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో మరో అత్యాచార ఘటన వెలుగు చూసింది. బెంగళూరుకు వలస కూలీగా వెళ్లిన మహిళ తన కుమార్తెను సోదరి ఇంట్లో ఉంచింది. పెద్దమ్మ ఇంట్లో ఉంటూ చిన్నారి 8వ తరగతి చదువుతోంది. అయితే పెద్దమ్మ కొడుకే ఆమెపై అత్యాచారానికి ఒడికట్టాడు. గత ఫిబ్రవరి నుంచి ఆమెపై పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఇంట్లో చెప్తే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. వినాయక చవితి పండగ సందర్భంగా బాధితురాలి తల్లి బెంగళూరు నుంచి వచ్చింది. తల్లిని చూసి ఒక్కసారిగా విలపించిన చిన్నారి జరిగిన దారుణాన్ని ఆమెకు వివరించింది. పెద్దమ్మ కొడుకు ఎనిమిది నెలలుగా తనపై చేస్తున్న అఘాయిత్యాన్ని పూసగుచ్చినట్లు వివరించింది. దీంతో ఇద్దరూ కలిసి శనివారం రాత్రి అలిపిరి పోలీసులను ఆశ్రయించారు.

# సేవ్.. దామగుండం

- దామగుండం మరో రామగుండం అవొద్దు
- సేవ్ నల్లమల తరహాలో కాపాడుకుందాం
- నేవీ రాడార్ ప్రాజెక్టుని అడ్డుకుందాం..
- ధర్నాలో పర్యావరణవేత్తల పిలుపు



**జనపదం, హైదరాబాద్:** అడవుల్ని కాపాడుకునే విషయంలో ప్రజల్ని పాలకులు మళ్లీ మళ్లీ మోసం చేస్తున్నారని ప్రముఖ పర్యావరణవేత్త, తెలంగాణ జల సాధన సమితి ఫౌండర్ దుశర్ల సత్యనారాయణ విమర్శించారు. భారతదేశంలోనే అతిపెద్ద అటవీ విధ్వంసకాండ తెలంగాణలో జరుగుతోంటే ప్రధాన రాజకీయ పార్టీలు ఎందుకు పట్టించుకోవట్లేదని విమర్శించారు. హైదరాబాద్ కి ఆక్సిజన్ సిలిండర్ లాంటి వికారాబాద్ లోని దామగుండం అడవి మరో రామగుండం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు విజ్ఞప్తి చేశారు. దామగుండంలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు చేయడం కోసం 12 లక్షల చెట్లను నరకడం దుర్మార్గమని పర్యావరణ కారులు ఆందోళన వ్యక్తం చేశారు. "సేవ్ నల్లమల" ఉద్యమంతో తెలంగాణ అసెంబ్లీ తీర్మానం ద్వారా యురేనియం తవ్వకాలపై కేంద్రం ప్రయత్నాలను నిలుపుదల చేయించినట్లే... దామగుండం అడవిని కాపాడాలన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని... రాడార్ కేంద్రాన్ని ప్రజలకు ఇబ్బంది కలగని మరోచోటికి తరలించాలని డిమాండ్ చేశారు. నేవీ రాడార్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆదివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ దగ్గర సేవ్ దామగుండం నిరసన ప్రదర్శన లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పర్యావరణ కారులు, సామాజికవేత్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దామగుండం జేఏసి, తులసి చందు యూట్యూబ్ ఛానెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో దామగుండంలోని రామలింగేశ్వర స్వామి ఆలయ పూజారి సత్యానంద స్వామి, పర్యావరణ వేత్త దుశ్చర్ల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, సంధ్యక్క, విమలక్కతో పాటు అనేక ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**సత్యానంద స్వామి మాట్లాడుతూ** 2,713 ఎకరాల దేవాలయ భూముల్ని ఫోర్జరీ చేసి అటవీశాఖకి అప్పగించారని ఆరోపించారు. నేవీ రాడార్ కేంద్రంతో పాటు యాంటినీ పార్కు, స్కూళ్లు, టౌన్ షిప్ లు కట్టడం వల్ల పర్యావరణ విధ్వంసం జరుగుతుందని, ఏళ్ల చరిత్ర కలిగిన రామలింగేశ్వర స్వామి ఆలయం కనుమరుగైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహిరంగ చర్చకు రావాలని పిలుపునిచ్చారు.

**దుశ్చర్ల సత్యనారాయణ మాట్లాడుతూ** అడవినే ఒక ఆస్తిగా చూడాలని అన్నారు. 1956లో తెలంగాణలో ఆంధ్రరాష్ట్రం కలిశాక ప్రకృతి విధ్వంసం మొదలైందని, 2014లో రాష్ట్ర విభజన తర్వాత అది మరింత ఎక్కువైపోయిందని అన్నారు. దామగుండం అటవీ విధ్వంసం భవిష్యత్ తరాల సమస్యని 18 ఏళ్ల లోపు పిల్లలందరిలో ప్రకృతిని కాపాడుకోవాలన్న అవగాహన పెంచాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే యజమానులని, అధికారంలో ఉన్న వారంతా సేవకులని, ప్రజలు చెప్పిన ప్రకారం వాళ్లంతా నడుచుకోవాలని అన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని, అభివృద్ధిని బ్యాలెన్స్ చేయకపోతే వయనాడ్ , ఉత్తరాఖండ్ వంటి ప్రకృతి విలయాలు చూడాల్సి వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించి పర్యావరణ నష్టం రిపోర్టుని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. మొదట 12 లక్షలు మొక్కలు నాటి అది అడవైన తర్వాతే నేవీ రాడార్ ప్రాజెక్టు కట్టుకోవాలన్నారు. జల్లికట్టుపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పుడు బలహీనుల వైపు ఆలోచించాలని చెప్పిందని గుర్తు చేశారు. మూసీ నది పుట్టిన దామగుండం అడవుల్ని ధ్వంసం చేస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ మూసీ నది ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటాననడం హాస్యాస్పదమని ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు.

**జర్నలిస్టు తులసి చందు మాట్లాడుతూ** దామగుండం సమస్య ఎంత తీవ్రమైనదో తాను స్టోరీ చేయడం కోసం అక్కడికి వెళ్లాక తెలిసిందన్నారు. చెట్లకు కూడా ఓట్లు ఉంటే అప్పుడు రాజకీయ పార్టీ నాయకులు దామగుండం దగ్గరకి తరలి వచ్చేవారన్నారు. 300 చెట్లను కాపాడడం కోసం చిప్కో ఉద్యమం వస్తే 12 లక్షల చెట్లను కాపాడడానికి ఎన్ని ఉద్యమాలు రావాలని, తెలంగాణలో ఎంతమంది సుందర్ లాల్ బహుగుణాలు పుట్టుకొని రావాలో ఆలోచించాలన్నారు. దామగుండం అడవుల్ని కాపాడడానికి చిప్కో దామగుండం అంటూ అక్కడ చెట్లను హత్తుకునే ఉద్యమం జరగాలని తులసి చందు పిలుపునిచ్చారు.

**దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ** హైదరాబాద్ వాసులు మాస్కులు పెట్టుకొని బతికే పరిస్థితులు రాకూడదని అన్నారు. నేవీ రాడార్ ప్రాజెక్టుని ఈ ప్రాంతంలో రాకుండా అడ్డుకోవాలంటే కోర్టుల్లో తాత్కాలికమైన స్టేలు కాకుండా శాశ్వతంగా ప్రాజెక్టు ఆగిపోయేలా చూడాలని అన్నారు.

**దామగుండం మాజీ సర్పంచ్ లక్ష్మయ్య మాట్లాడుతూ** ఆరేళ్ల క్రితం రెవిన్యూ శాఖ అధికారులు ఉపాధి అవకాశాలను ఎరగా చూపించి నేవీ రాడార్ కోసం అనుమతులు అడిగారని చెప్పారు. అప్పట్లో సర్పంచ్ గా ఉన్న యాదమ్మ మూడో తరగతి మాత్రమే చదవడంతో సమస్య తీవ్రత తెలీక భూములు అప్పగిస్తూ సంతకాలు చేశారన్నారు. ప్రాజెక్టు వల్ల స్థానికులకు 3 వేల కాంట్రాక్ట్ ఉద్యోగాలు తప్ప వచ్చేదేమీ లేదన్నారు.

**పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ** ఈ ప్రాజెక్టుపై 2018 లో కేంద్రం ముందుకు వెళితే అప్పట్లో బీఆర్ ఎస్ ప్రభుత్వం ఆపిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంతకాలు పెట్టేశారన్నారు. తెలంగాణ ఊటీ అయిన దామగుండాన్ని కాపాడడానికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు. ఢిల్లీకి వెళ్లి ధర్నా చేయడానికి సిద్ధమన్నారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఇప్పటివరకు ఏం జరిగిందో చర్చించడం కాదని భవిష్యత్ లో దీనిని ఎలా ఆపాలన్నది ముఖ్యమన్నారు. కార్యక్రమం ఇక్కడితో ఆపకుండా ఢిల్లీ వరకు వెళ్లేలా ఉద్యమాన్ని తీసుకువెళ్లాలని దామగుండం జేఏసీ తీర్మానించింది. కార్యక్రమంలో విమలక్క పాడిన దామగుండాల నువ్వు చల్లగుండాల అన్న పాట అందరినీ అలరించింది.

## ఎంఐఎం స్థావరంలోనే ఉగ్రవాదం..

- పోషిస్తున్నది ఆ పార్టీయే..
- ఓవైసీ కాలేజీలో ఫ్యాకల్టీ ఉగ్రవాదిగా పట్టుబడ్డాడు..
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**జనపదం, కరీంనగర్:** ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పార్టీ ఎంఐఎం అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విరుచుకుపడ్డారు. బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా కరీంనగర్ లో జరుగుతున్న డ్రైవ్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 10 కోట్లు సభ్యత్వాలు టార్గెట్ గా ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు. మెంబర్ షిప్ డ్రైవ్ కి అపూర్వ స్పందన వస్తుందన్నారు. దేశవ్యాప్తంగా 25 వ తేదీ మెంబర్ షిప్ డ్రైవ్ చేపట్టామని తెలిపారు. కరీంనగర్ లో రెండు రోజుల పాటు డ్రైవ్ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అతి తక్కువ కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం పై వ్యతిరేకత ఏర్పడిందన్నారు. కేరళ ప్రజలు బీజేపీపై సానుకూలంగా ఉన్నారని తెలిపారు. 15 నిమిషాలు కేటాయిస్తే నరికి చంపుతానన్న ఓవైసీ కి ఏం ఫోబియా ఉంది. హిందూ దేవుళ్లను కించపరిచే ఒవైసీ కి ఏం ఫోబియా ఉంది ఎంఐఎం నేతలు ఇప్పటికీ జాతీయ గీతం ఆలపించరు. వారికి ఏం ఫోబియా ఉందో ప్రజల అర్థం చేసుకోవాలన్నారు. ఓల్డ్ సీటు న్యూ సీటు గా మారుస్తానన్న వ్యాఖ్యలను ముస్లిం పెద్దలే సమర్థించారని వ్యాఖ్యానించారు. ఓవైసీ కాలేజీలో ఫ్యాకల్టీ ఉగ్రవాదిగా పట్టుబడ్డారు. సెక్యులర్ అనేవాళ్లు హిందువుల పండుగ ఏనాడైనా జరుపుకున్నారా అంటూ ప్రశ్నించారు. ఉగ్రవాదులను పెంచి పోషించేది ఎంఐఎం పార్టీ అంటూ ఆరోపించారు. వన్ నేషన్ , వన్ ఎలక్షన్ కి కేంద్రం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కేటీఆర్ కి మీడియా ఫోబియా పట్టుకుందని ఎద్దేవా చేశారు. అమృత్ పథకం అక్రమాలపై ఫిర్యాదు చేస్తే కేంద్రం విచారణకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తిరుపతి లడ్డూ లో కల్తీ హిందూ ధర్మం పై దాడి గా పరిగణించాల్సిందే అన్నారు.

# అమ్మదొంగా..?!

- గాంధీ.. ఇదేందీ..?
- సీఎం దీనికేమంటారు...?
- సీఎల్పీ భేటీకి అరికెపూడి..
- బయటపడిన బండారం..

**జనపదం, హైదరాబాద్ :** పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగిన తీరున్నది ఈ వ్యవహారం. మోసం చేస్తూ ఎన్ని రోజులు గడుపుతారు.., దబాయిస్తూ ఎంత కాలం కళ్లు మూయిస్తారు. నిజం ఏనాటికైనా బయటపడాల్సిందే., అవాస్తవం ప్రపంచం ముందు తప్పకుండా దోషిగా నిలపాల్సిందే. సృష్టి ధర్మమదే., లోకం పోకడ ముమ్మాటికి అంతే. పాపం పండాలేగానీ ఏది ఆగదు., ఏది దాగదు. దొరకనంత వరకు దొరలు., దొరికితే అంతా దొంగలే. అరికెపూడి వ్యవహారం కూడా అచ్చు అలాగే ఉంది. బీఆర్ఎస్ బీఫాం పై గెలిచి, కాంగ్రెస్ తో దోస్తీ చేస్తున్న ఈ ఎమ్మెల్యే తీరు ఆది నుంచి వివాదంగానే తయారైంది. తమ ఎమ్మెల్యేను ఎలా పీఏసీగా నియమిస్తారని ఈ మధ్య రచ్చరచ్చ జరిగిన విషయం తెలిసిందే. అయితే తాను బీఆర్ఎస్ లోనే ఉన్నానని, తనకు హస్తం పార్టీతో సంబంధం లేదని దబాయిస్తూ వచ్చిన అరికెపూడి గాంధీ ఆదివారం అడ్డంగా బుక్కయ్యారు. సీఎల్పీ భేటీలో సడెన్ గా ప్రత్యక్షమయ్యారు. స్వయంగా ముఖ్యమంత్రి తో చెట్టాపట్టాలేసుకుని కనిపించాడు. ఆ ఫొటోలు బయటకు లీక్ అవడంతో బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.



### మర్యాదపూర్వకంగా కలిశాడు..
### -మంత్రి శ్రీధర్ బాబు

అరికెపూడి గాంధీ సీఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా మాత్రమే కలిశారు. ఆయన నియోజకవర్గ పరిధిలో సమావేశం జరుగుతుండడంతో కేవలం స్నేహపూర్వకంగా మాత్రమే ఆయన కలిశారని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆరోపిస్తున్నట్టుగా ఆయన సీఎల్పీ సమావేశానికి హాజరు కాలేదని, ప్రతి దానికి సూక్ష్మంలో చూసే హరీష్ రావు వంటి వారు నిజానిజాలు తెలుసుకుని మాట్లాడాలని మంత్రి సూచించారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా తన నియోజకవర్గానికి కావాల్సిన నిధులు రాబట్టుకోవడం కోసం ఎమ్మెల్యేలు ఎవరైనా కలిసే హక్కు ఉంటుందని, ఆ ప్రకారమే గాంధీ కూడా కలిశారన్నారు. దానిని కూడా రాద్ధాంతం చేసి రాజకీయంగా పబ్బం గడుపుకోవాలని బీఆర్ఎస్ చూడడం విడ్డూరంగా ఉందని మంత్రి దుయ్యబట్టారు.

## దొంగ దొరికాడు..
### ఇప్పుడేం చెబుతారో..?
### ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పాల్సిందే..
### రేవంత్ కు మాజీ మంత్రి హరీష్ సూటి ప్రశ్న



ఇన్నాళ్లు దొర ముసుగులో తిరిగిన దొంగ ఇప్పుడు దొరికాడు. తనకు తానుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని ప్రకటించుకుంటూ, మరెవ్వరికీ అనే అవకాశం ఇవ్వనని గొప్పలకు పోయిన అరికెపూడి ఇప్పుడు కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ మీటింగ్ కు ఎందుకు హాజరయ్యారో చెప్పాలని మాజీ మంత్రి హరీశ్ రావు నిలదీశారు. ఒక పార్టీ ఎమ్మెల్యే మరో పార్టీ ప్రధాన మీటింగ్ కు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో వివరణ ఇవ్వాలని, ఇదే విషయమై సీఎం కూడా స్పష్టమైన సమాధానం చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అరికెపూడి గాంధీ విషయంలో తాము ప్రతిసారి అడుగుతున్న ప్రశ్నలకు సీఎం సహా కాంగ్రెస్ పెద్దలంతా దాటవేత ధోరణితో అదిలించడానికి ప్రయత్నించారని హరీష్ అన్నారు. పీఏసీ చైర్మన్ నియామకంలో ప్రధాన ప్రతిపక్షానికి ఇవ్వాలనే సంప్రదాయాన్ని కూడా పక్కన బెట్టారని, గాంధీ ముమ్మాటికి హస్తం పార్టీలో చేరిన ఎమ్మెల్యే అని తాను మొదటి నుంచి మొత్తుకుంటూనే ఉన్నాని, అయినా సీఎం దాబాయిస్తూ నెట్టుకొస్తున్నాడన్నారు. చైర్మన్ ను బీఆర్ఎస్ కు కేటాయించాల్సింది పోయి, పార్టీ మారిన వ్యక్తికి ఇచ్చి చారిత్రక తప్పిదం చేశారని నిలదీసినందుకు తనపై సీఎం విరుచుకుపడిన తీరు యావత్ ప్రజానీకం అంతా గమనించారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీకి సమావేశానికి అరికెపూడి గాంధీ హాజరవడంతో తానన్న మాటలు అక్షర నిజాలయ్యాయని హరీష్ అన్నారు. ఇప్పటికైనా తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, గాంధీ ఏ పార్టీ ఎమ్మెల్యేనో సీఎం స్వయంగా ప్రజలకు తెలియజెప్పాలని హరీష్ డిమాండ్ చేశారు.

# ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇస్తాం..



**(మొదటిపేజీ తరువాయి)**ఇచ్చామని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసినందుకే వారికి పదవులు దక్కాయని గుర్తు ఉంచుకోవాలన్నారు. పార్టీ లో కష్టపడి పనిచేసిన వారికి ఖచ్చితంగా అవకాశాలు వస్తాయన్నారు.

**బీసీ కులగణన..**

నరేంద్ర మోదీని ఓడించాల్సిన చారిత్రాత్మక అవసరం ఉన్న సమయంలో పీసీసీ చీఫ్ గా మహేష్ బాధ్యత చేపట్టారని సీఎం అన్నారు. బీసీ కులగణన చేయాలన్నది రాహుల్ గాంధీ బలమైన ఆలోచన అని, రాహుల్ ఆలోచన మేరకు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను నియమించామన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే కచ్చితంగా జనాభాను లెక్కించాల్సిందేనని పేర్కొన్నా రు. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేసి ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందన్నారు.

**జమిలీపై అప్రమత్తంగా..**

దేశంపై నాలుగోసారి పట్టు సాధించడానికి మోడీ ప్రయత్నాలు చేస్తున్నారని, నాలుగోసారి గెలవడం కోసమే ప్రధాని మోదీ జమిలీ ఎన్నికలు తీసుకువస్తున్నారన్నారు. జమిలీ ఎన్నికలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న కొత్త కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు సూచించారు. భారతదేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం 27 రోజుల్లో 18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేయలేదని, అది కేవలం కాంగ్రెస్ తెలంగాణ సర్కార్ కే సాధ్యమైందన్నారు. రైతు రుణ విముక్తి కావడమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారం కోల్పోయిన అసహనంలో ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇన్చార్జి మంత్రులు వారానికి రెండు సార్లు జిల్లాల్లో పర్యటించాలని, పార్టీలో కష్టపడి పనిచేసే వారికి కచ్చితంగా అవకాశాలు వస్తాయన్నారు.

**అత్యుత్సాహం సరికాదు..**

పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, జాగ్రత్తగా మెలగాలని సీఎం రేవంత్‌రెడ్డి హితవు పలికారు. ప్రతి ఎమ్మెల్యే సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నియోజకవర్గ ప్రజలను కలిసేందుకు సమయం కేటాయించాలని సూచించారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టే విధంగా సన్నద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే కు స్పష్టం చేశారు. ఈ సీఎల్పీ సమావేశంలో పీసీసీ కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బి. మహేశ్ కుమార్ గౌడ్‌ను సీఎం రేవంత్ రెడ్డి సన్మానించారు. సమావేశానికి పార్టీ ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ, కడియం శ్రీహరి, దానం నాగేందర్, ప్రకాశ్ గౌడ్ తదితరులు సైతం ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాగా, కొత్త పీసీసీ అధ్యక్షుడి నియామకం అనంతరం సీఎల్పీ సమావేశం జరగడం చాలా కాలంగా ఓ అనవాయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. ఇక 2021లో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టా రు. నాటి నుంచి కాంగ్రెస్ పార్టీని ఆయన ప్రజల్లోకి తీసుకు వెళ్లారు. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలను సైతం ఆయన తన వాగ్దాటితో వివిధ సభల్లో ఎండగట్టారు. ఆ క్రమంలో జరిగిన ఎన్నికల్లో తెలంగాణ ప్రజ లు.. కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టి.. బీఆర్ఎస్ ను ప్రతిపక్షానికి పరిమితం చేసిన విషయం తెలిసిందే.

# పొంగులేటి నాతో రా..




**(మొదటిపేజీ తరువాయి)** చెప్పాలన్నారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ తో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లను కూడా నేను ప్రస్తావించిన నేపథ్యంలో పొంగులేటి ఆగమేఘాలమీద ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారని అన్నారు. రూ.1137 కోట్ల రూపాయల అవినీతి జరిగిన, ఒక్క రూపాయి అవినీతి జరిగిన ఈ చట్టం వర్తిస్తుందనే విషయం ఆయన తెలుసుకోవాలన్నారు. పొంగులేటికి చిత్తశుద్ధి ఉంటే హైకోర్టు చీఫ్ జస్టిస్ దగ్గరికి వెళ్దామన్నారు., లేదంటే కేంద్రంలోని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ లేదా మరి ఏదైనా ఏజెన్సీ దగ్గరకైనా వెళ్దాం అన్నారు. గతంలో ఉన్న ఫైల్స్ తో పాటు ఇప్పుడు జరిగిన టెండర్ల వ్యవహారం పైన వివరా లు వారి ముందు ఉంచుదామన్నారు. ఆయన న్యాయంగా తీర్పు చెప్పిన తర్వాత నేను చెప్పింది అబద్ధమంటే రాజీనామా కాదు రాజకీయ సన్యాసం చేస్తా అని సవాల్ చేశారు.

**అంతా పొంగులేటికి తెలుసు..**

రేవంత్ రెడ్డి పదవిని ఊడ బీకటానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్, కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప పదవులు పోయినట్లే రేవంత్ కూడా కోల్పోబోతున్నాడని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ టెండర్ల వ్యవహారంలో అవినీతి జరిగిందని ముఖ్యమంత్రికి, మంత్రి పొంగులేటికి తెలుసు అన్నారు. ముఖ్యమంత్రి ఆశ్రిత పక్షపాతం లేకుండా బంధువులకు అక్రమంగా లాభం చేయను అని ప్రమాణ స్వీకారం చేసిన సీఎం రేవంత్ అవినీతికి పాల్పడ్డాడని విమర్శించారు. కేవలం రెండు కోట్ల లాభం ఉన్న బావమరిది కంపెనీకి రూ.1000 కోట్ల కాంట్రాక్టు ఇచ్చి అవినీతి జరగడం లేదు అంటే ఎవరైనా నమ్ముతారా..? అని నిలదీశారు. ఈ మొత్తం కేంద్ర ప్రభుత్వ నిధుల వ్యవహారాలకు సంబంధించిన అంశంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ నుంచి మొదలుకొని బీజేపీకి చెందిన ఒక్క ఎంపీ కూడా మాట్లాడటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధుల్లో అవినీతి జరుగుతున్నా వారు ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనించాలని కోరుతున్నానని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తరచుగా చెప్తున్న ఫోర్త్ సిటీ కాదని.. ముచ్చర్ల ఫోర్ బ్రదర్స్ సిటీ అని ఆరోపించారు. పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపిన తమకు ఎక్కడ అవినీతి జరుగుతుందో తెలియదా? అని అన్నారు. కొడంగల్ లిఫ్ట్ కథ సహా.. సీఎం కుటుంబ సభ్యుల అవినీతిని తేలుస్తామని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి అవినీతిపైన మా దగ్గర సమాచారం ఉందన్నారు. ఈ అవినీతిని వరుసగా బయటపెడతామని కేటీఆర్ హెచ్చరించారు.

**తన బావమరిదికి** అక్రమంగా టెండర్లు కట్టబెట్టిన వ్యవహారం రేవంత్ మెడకు చుట్టుకుంటుందని కేటీఆర్ అన్నారు. భార్య సోదరుడు బావమరిది కాకుండా ఏమవుతారు? అని ప్రశ్నించారు. బావమరిది వ్యవహారంలో ఇరికిపోయానని సీఎంకు కూడా తెలుసునని అన్నారు. చట్టాలే కాదు.. చుట్టరికాలు కూడా ప్రభుత్వ పెద్దలకు తెలియనట్లుందని కేటీఆర్ విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే హైకోర్టు సీజే వద్దకు మంత్రి పొంగులేటి తనతో కలిసి రావాలని కేటీఆర్ సవాల్ విసిరారు.

# ఉసురు తాకిపోతవ్..

**(మొదటిపేజీ తరువాయి)** కూల్చివేస్తున్నట్లు హైడ్రా స్పష్టం చేసింది. ఇవాళ మూడు చోట్ల 44 అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, 8 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వెల్లడించింది. కూకట్పల్లి నల్లచెరువులో 4 ఎకరాలు, అమీన్పూర్ మండలం కిష్టారెడ్డిపేటలో ఎకరం, పటేల్గూడలో 3 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణ చెర నుంచి విడిపించినట్లు హైడ్రా తెలిపింది. నీటి వనరుల పునరుద్ధరణ, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా 12 రోజుల తర్వాత మరోసారి హైదరాబాద్ మహానగరంలో పంజా విసిరింది. మూడు చోట్ల బుల్డోజర్లతో విరుచుకుపడి, పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది. కూకట్పల్లి నల్ల చెరువు, సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలంలోని కిష్టారెడ్డిపేట, పటేల్గూడలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన నివాసాలను, బహుళ అంతస్తుల భవనాలను నేలమట్టం చేసింది.

**కూల్చివేతలపై హైడ్రా ప్రకటన**

ఆదివారం జరిగిన కూల్చివేతలకు సంబంధిం చి వివరణ ఇచ్చిన హైడ్రా, ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో నివాసం కోసం కాకుండా వ్యాపారం కోసం ఏర్పాటు చేసిన నిర్మాణాలను మాత్రమే కూల్చివేసినట్లు స్పష్టం చేసింది. కూకట్పల్లి నల్ల చెరువు 27 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, సర్వే నెంబర్ 66, 67, 68, 69లో 16 కమర్షియల్ షెడ్లు, ప్రహరీ గోడలను అక్రమంగా నిర్మించినట్లు గుర్తించామని, వాటిని కూల్చివేసి 4 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వెల్లడించింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించి వాణిజ్య కార్యకలాపాల కోసం భవనాలను నిర్మించారని హైడ్రా పేర్కొంది. కిష్టారెడ్డిపేటలో సర్వే నెంబర్ 164లో వాణిజ్యపరంగా నిర్వహిస్తున్న 3 ఐదంతస్తుల భవనాలను కూల్చివేశామని, అక్కడ ఎకరం ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వివరించింది. అలాగే పటేల్గూడలోని సర్వే నెంబర్ 12/2, 12/3లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి 25 నివాసాలు



ఏర్పాటు చేసుకున్నారని, వాటిని తొలగించి 3 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.

**8 ఎకరాలు స్వాధీనం..**

ఈ మూడు ప్రాంతాల్లో మొత్తంగా 8 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించినట్లు హైడ్రా వివరించింది. రెవెన్యూ, నీటి పారుదల, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి సంయుక్తంగా మూడు చోట్ల ఆపరేషన్ చేపట్టామని హైడ్రా వెల్లడించింది. నీటి వనరుల సంరక్షణ, ప్రభుత్వ భూములు అన్యక్రాంతం కాకుండా చూడటమే తమ లక్ష్యంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. హైడ్రా ఏర్పడి రెండు నెలలు పూర్తైంది. ఇప్పటి వరకు 26 చోట్ల 306 అనధికారిక నిర్మాణాలను కూల్చివేసింది. 119 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా ఆక్రమణదారుల నుంచి విడిపించింది.

**కూకట్ పల్లిలో కూల్చివేతలు ..**

**సమాచారం ఇస్తే సామాన్లు సర్దుకునే వాళ్లం**

**బాధితుల ఆవేదన**

కూకట్ పల్లి నల్లచెరువు ఎఫ్ టీఎల్ పరిధిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్(హైడ్రా) కూల్చివేతలు చేపట్టింది. ఆదివారం తెల్లవారుజామునే అధికారులు కూల్చివేతలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఎలాంటి ఉద్రిక్తత చోటు చేసుకోకుండా భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

**నల్లచెరువు 7 ఎకరాలు కబ్జా**

కూకట్ పల్లిలోని నల్లచెరువు మొత్తం విస్తీర్ణం 27 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, దీనిలో ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ లలో 7 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించామని హైడ్రా అధికారులు తెలిపారు. కొద్ది రోజుల క్రితమే నల్లచెరువు ఎఫ్ టీఎల్ పరిధిలో కబ్జాకు గురైన ప్రాంతాలను పరిశీలించి పూర్తిస్థాయి నివేదికను తయారు చేశామని హైడ్రా అధికారులు తెలిపారు. నివాసం ఉన్న భవనాలను మినహాయించి మిగతా 16 షెడ్లను కూల్చివేశామన్నారు.

**నోటీసులు ఇస్తే వెళ్లిపోయేవాళ్లం**


కూకట్ పల్లి నల్లచెరువు వద్ద కూల్చివేతల సమయంలో ఇక్కడి బాధితులు కన్నీరుపెట్టుకున్నాడు. ఈ స్థలాలను లీజుకు తీసుకుని వ్యాపారం చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం సామగ్రి తీసుకువెళ్లేందుకు కూడా సమయం ఇవ్వకుండా కూల్చివేశారని కంటతడి పెట్టుకున్నారు. తమకు నోటీసులు జారీ చేసి సమయం ఇచ్చి ఉంటే తామే ఖాళీ చేసి వెళ్లిపోయే వాళ్లమన్నారు. తమకు భూమిని లీజుకు ఇచ్చిన యజమానులు సైతం ఈ స్థలం ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ లోకి రావంటూ చెప్పడంతోనే తీసుకుని ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాటరింగ్ షెడ్డును ఖాళీ చేయడానికి నెల రోజులు సమయం ఇవ్వాలని బాధితులు అధికారుల కాళ్ళ మీద పడి వేడుకున్నా అధికారులు కనికరించలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే గతంలోనే వ్యాపార సముదాయాలకు నోటీసులు ఇచ్చామని అధికారులు చెబుతున్నారు.

## 'మూసీ' కూల్చివేతలకు వెనకడుగు..?

మూసీ పరివాహక ఆక్రమణల కూల్చివేతలకు తాత్కాలిక బ్రేక్ పడినట్టు తెలుస్తున్నది. మొత్తం 55 కిలోమీటర్ల పరిధిలో 12 వేలకు పైగా ఆక్రమణలు గుర్తించిన హైడ్రా అధికారులకు అక్కడి నిర్వాసితులకు పునరావాసం కల్పించడం సవాలుగా మారడం.. ఇటు నిర్వాసితులకు మలక్ పేట సెగ్మెంట్ లోని పిల్లిగుడిసెల్లో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపును స్థానికులు వ్యతిరేకిస్తుండడంతో ఏం చేయాలో తోచక హైడ్రా అధికారులు తలలుపట్టుకుంటున్నారు. ఇదే క్రమంలో మూసీ నిర్వాసితులకు కేటాయించిన మలక్ పేట సెగ్మెంట్ లోని పిల్లిగుడిసెల్లో ఖాళీగా ఉన్న ఇళ్లను పరిశీలించేందుకు ఈ నెల 21న అక్కడికి వెళ్లిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను అక్కడి స్థానికులు అడ్డుకుని ఝలక్ ఇచ్చారు. దీంతో వారిని సముదాయించలేక పోయిన మంత్రి, అధికారులు వెనక్కి తిరిగారు. అయితే ఎలాగూ అలా స్థానికులను బుజ్జగించినా పిల్లిగుడిసెల్లో నాలుగొందలకు మించి గృహాలు సిద్ధంగా లేకపోవడం.. మిగిలిన చోట్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో మూసీ నిర్వాసితులను ఎక్కడ ఉంచాలో తెలియక తర్జనభర్జన పడుతున్నారు. ఇదీలావుంటే.. మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టు వ్యయం రూ.50,000 కోట్లుగా అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆ తర్వాత రూ.70,కోట్లకు సవరించింది. అయితే ముసాయిదా ప్రణాళికలు సిద్ధం కాకముందే అంచనాలను రూ.1.5లక్షల కోట్లకు సవరించిన విషయం తెలిసిందే. దీనిపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో మూసీ ప్రక్షాళన, సుందరీకరణ సాధ్యమైనా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే తాజాగా ఆదివారం నుంచి మూసీపరివాహక నిర్మాణాలు కూల్చివేస్తామని ప్రకటించిన హైడ్రా.. అనూహ్యంగా తన నిర్ణయాన్ని మార్చుకుని కూకట్ పల్లి, అమీన్ పూర్, పటేల్‌గూడలోని ఆక్రమిత స్థలాల్లో నిర్మించిన కట్టడాలను కూల్చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే రానున్న రోజుల్లా మూసీ సుందరీకరణ కోసం హైడ్రా ఎలాంటి వ్యూహంతో ముందుకువెళ్తుందో వేచి చూడాలి.

# కాళేశ్వరం వృథా ప్రాజెక్టు కాదు..

- అప్పగించిన ఎల్లంపల్లిని రన్నింగ్ ప్రాజెక్టుగా మార్చాం
- మంత్రి పొన్నంది అవగాహనా రాహిత్యం
- మాజీ మంత్రి హరీశ్ రావు




**జనపదం, బ్యూరో :** కాళేశ్వరం వృథా ప్రాజెక్టు కాదని కాంగ్రెస్ ప్రభుత్వమే నిరూపించిందని, నన్ను విమర్శించే పనిలో మంత్రి పొన్నం ప్రభాకర్ అవగాహనా రాహిత్యం బయటపడిందని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు తామే పూర్తి చేశామని పొన్నం గొప్పలు చెప్పకోవడం విడ్డూరంగా, సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో వివక్షకు గురై, పెండింగ్ ప్రా(జెక్టుగా మిగిలిన ఎల్లంపల్లి ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చిందన్న విషయాన్ని ఆయన మరిచిపోతున్నారన్నారు. పేరుకే బ్యారేజి పూర్తి చేశారు తప్ప నీళ్లు నింపింది లేదు.... రైతులకు ఇచ్చిందీ లేదని విమర్శించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అనేక అంశాలపై అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలిపెట్టిందన్నారు.

**రన్నింగ్ ప్రాజెక్టుగా మార్చాం..**

నిరుపయోగంగా ఉన్న ఎల్లంపల్లిని మాకు అప్పగించితే దాన్ని రన్నింగ్ ప్రాజెక్టుగా మార్చామని హరీశ్‌రావు గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణ, పునరావాసం, హై లెవల్ బ్రిడ్జి, రహదార్ల నిర్మాణం కోసం రూ. 2,052 కోట్ల వెచ్చించిందని గుర్తు చేశారు. బరాజ్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎల్లంపల్లి ప్రాజెక్టును ఒక కీలకమైన 'బ్యాలెన్సింగ్ రిజర్వాయర్' గా మార్చిన తర్వాతనే జలాశయం మీదనే ఆధారపడిన అన్ని ప్రాంతాలకు నీటిని అందించే పని ప్రారంభం అయ్యిందన్నారు. ఇదంతా జరిగింది తెలంగాణ ఏర్పడిన తర్వాతనే అన్న వాస్తవాన్ని పొన్నం ప్రభాకర్ గుర్తించకపోయినా కరీంనగర్ రైతాంగానికి తెలుసు అని స్పష్టం చేశారు. తెలంగాణ వచ్చాకనే పునరావాస కాలనీల నిర్మాణం పూర్తి చేసి, ముంపు బాధితులకు నష్ట పరిహారం చెల్లించిందన్నారు. అలాగే ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కాలనీలకు తరలించి, రాజీవ్ రహదారిపై వేగంగా హై లెవెల్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి చేసి ఎల్లంపల్లి జలాశయంలో ఎఫ్ ఆర్ ఎల్ 148 మీటర్ల వరకు 20 టీఎంసీల నీటిని నింపామని హరీశ్‌రావు తెలిపారు. అది బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన ఘనత అని పేర్కొన్నారు.

**నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాం...**

బాబా సాహెబ్ అంబేద్కర్ పేరు మీద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రూపకల్పన చేసిన ప్రాజెక్ట్ లో భాగమైన

## ఆ విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే నిరూపించింది

ఎల్లంపల్లి, నంది మేడారం, మిడ్ మానెరు, అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లు ఉన్నాయని పొన్నం నిజాయితీగా ఒప్పుకున్నందుకు సంతోషమని హరీశ్‌రావు అన్నారు. ప్రాజెక్టును రీ ఇంజనీరింగ్ చేసినప్పుడు ఎల్లంపల్లి నుంచి కొండపోచమ్మ సాగర్ దాకా అలైన్మెంట్ మార్చలేదని తాము గతంలో ఎన్నోసార్లు చెప్పామని గుర్తుచేశారు. సీడబ్ల్యూసీ సలహాల మేరకు ఈ ఆన్ లైన్ జలాశయాల నిల్వ సామర్థ్యాన్ని పెంచామన్నారు. ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టులో మొత్తం జలాశయాల నిల్వ సామర్థ్యం కేవలం 14 టీఎంసీలే కానీ.. రీ ఇంజనీరింగ్ తర్వాత 141 టీఎంసీలకు పెరిగిందన్నారు. ఎల్లంపల్లి నుంచి లిఫ్ట్ చేసినా కూడా మీరు వినియోగించింది కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మాణం అయిన సదుపాయాలనే కదా అని ప్రశ్నించారు. ఎల్లంపల్లి అప్పుడు ప్రాణహిత-చేవెళ్లలో భాగంగా ఉండేది. రీ ఇంజనీరింగ్ తర్వాత ఇప్పుడు కాళేశ్వరంలో భాగమైందన్నారు. అవి కాళేశ్వరంలో భాగమైన ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోసిన నీళ్లే అయినా కాళేశ్వరం వ్యవస్థ ద్వారా చేరిన గోదావరి నీళ్లే కదా అని అన్నారు.

**పొన్నంకు అవగాహనలేదు..**

కాళేశ్వరం ప్రాజెక్టులో ఎత్తిపోతల ప్రక్రియ అర్థం అయితే పొన్నం ఈ రకంగా ఇవి కాళేశ్వరం నీళ్ళు కావు అనేవాడు కాదని హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరంలో ఎత్తిపోతల ప్రక్రియ గురించి కూడా గతంలో అనేక సార్లు వివరించామని, అయినా అదే పాత పాట పాడుతూనే ఉంటారని అన్నారు. ' పొన్నం మళ్లీ.. మళ్ళీ చెపుతున్నాను. శ్రీరాంసాగర్ వద్ద వరద ఉంటే, నీటి లభ్యత ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టులో లింకు-1, లింకు-2 లో పంపులు నడుపరు. ఒకవేళ శ్రీరాంసాగర్ వద్ద నీరు లేకపోతే, ఎల్లంపల్లి వద్ద నీటి లభ్యత ఉన్నట్లయితే లింకు-1 లో పంపులు నడపరు. లింకు-2 నుంచే ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు, అక్కడి నుంచి లింకు-4 లో ఉన్న పంపుల ద్వారా అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ కు నీటిని లిఫ్ట్ చేయడం జరుగుతుంది. ఈ రెండు చోట్ల నీరు లేని కాలంలోనే లింకు-1 లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ నుంచి ఎల్లంపల్లికి, అక్కడి నుంచి లింకు-2 లో పంపింగ్ ద్వారా మిడ్ మానేరుకు, అక్కడి నుంచి లింకు-4 లో పంపింగ్ ద్వారా ఎగువన ఉన్ననాలుగు జలాశయాలకు, శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకం ద్వారా శ్రీరాంసాగర్ కు, మల్లన్నసాగర్ నుంచి నిజాం సాగర్ కు, బస్వాపూర్ కు నీటిని పంపడం జరుగుతుంది. ఇదీ కాళేశ్వరం ప్రాజెక్టులో ఉన్న వెసులుబాటు.' అని తెలిపారు. ' ఈ ఏడు శ్రీరాంసాగర్ వద్ద, ఎల్లంపల్లి వద్ద నీటి లభ్యత ఉన్న కారణంగా ఎల్లంపల్లి నుంచే నీటిని పంపింగ్ చేయగలిగినారు. అయితే ప్రకృతి అన్ని సీజన్లలో ఈ రకంగా సహకరించే అవకాశం లేదు. ముఖ్యంగా రబీ సీజన్‌లో నీటిని మేడిగడ్డ వద్ద నుంచే లిఫ్ట్ చేయవలసి ఉంటుంది. కాళేశ్వరం మొత్తంగా ఒక సమగ్ర గోదావరి వ్యాలీ అభివృద్ధి ప్రాజెక్టుగానే చూడాలి తప్ప విడివిడి ప్రాజెక్టులుగా చూడటం అనేది అవగాహనారాహిత్యం అవుతుంది. ఈ సంగతిని పొన్నం, ఇతర కాంగ్రెస్ నాయకులు గమనిస్తే మంచిది' అని హరీశ్‌రావు అన్నారు.

# ఇడ్లీలో ప్లాస్టిక్ తాడు..

- ఇందేంటని అడిగితే నిర్లక్ష్యపు సమాధానం
- బిల్లు కట్టి వెల్లండంటూ హోటల్ యజమాని హుకుం..
- సుప్రభాత్ హోటల్ ను సీజ్ చేయాలని స్థానికుల డిమాండ్



**జనపదం, మేడ్చల్ :** హబ్సిగూడ చౌరస్తాలో గల సుప్రభాత్ హోటల్ లో ఆదివారం ఉదయం దారుణం చోటుచేసుకుంది. ఓ ఐదుగురు కస్టమర్లు ఉదయం టిఫిన్ చేద్దామని ఇడ్లీ ఆర్డర్ చేయగా, కొద్ది సేపటి తరువాత సర్వెంట్ ఇడ్లి, సాంబార్ ని తీసుకు వచ్చారు. దానిని తిందామనుకునేలోగా ఓ పొడుగాటి ప్లాస్టిక్ తాడు సాంబార్లో ప్రత్యక్షమైంది. ఇదేంటని హోటల్ నిర్వాహకులను కస్టమర్లు ప్రశ్నించగా నిర్లక్ష్యపు సమాధానం చెబుతూ దాటవేశారు. పైగా హోటల్ యజమాని పట్టించుకోకుండా బిల్లు కట్టి వెళ్ళండి అంటూ కస్టమర్లపై దురుసుగా ప్రవర్తించాడు. దీనిపై ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు. ఇలా మేడ్చల్ జిల్లాలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట ఇలాంటి దారుణాలు జరుగుతూనే ఉన్నాయని, అయినా ఫుడ్ సేఫ్టీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తక్షణమే హబ్సిగూడ చౌరస్తాలో ఉన్న సుప్రభాత్ హోటల్ ను క్షుణ్ణంగా తనిఖీ చేసి సీజ్ చేయాలని కోరుతున్నారు.

# క్వాడ్ ఎవరికీ వ్యతిరేకం కాదు

- ప్రధాని నరేంద్రమోడీ
- బైడెన్‌తో చర్చలు ఫలించాయని వెల్లడి
- న్యూయార్క్ చేరుకున్న భారత ప్రధాని




**జనపదం, బ్యూరో** :14 క్వాడ్ ఎవరికీ వ్యతిరేకం కాదనీ, ఇది అంతర్జాతీయ భద్రత, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు మద్దతు ఇస్తుందని ప్రధాని మోడీ అన్నారు. దక్షిణ, తూర్పు చైనా సముద్రంలో వివాదాలలో నిమగ్నమై ఉన్న చైనాపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. అమెరికాలోని డెలావేర్‌లో జరుగుతున్న క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచాన్ని ఉద్రిక్తతలు, సంఘర్షణలు చుట్టుముట్టిన పరిస్థితిలో భాగస్వామ్య ప్రజాస్వామ్య విలువల ఆధారంగా క్వాడ్‌తో కలిసి పనిచేయడం మొత్తం మానవాళికి చాలా ముఖ్యమని చెప్పారు. చాలా తక్కువ సమయంలో క్వాడ్ దేశాలు సహకారాన్ని ప్రతి దిశలో విస్తరించాయని చెప్పారు. 2025లో ఈ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తుండటంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు ప్రధాని మోడీ.. డెలవేర్‌లోని బైడెన్ నివాసంలో భేటీ కాగా, ఇరువురి చర్చలు ఫలప్రదమైనట్లు ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ సందర్భంగా ఆతిథ్యమిచ్చినందుకు బైడెన్‌కు ధన్యవాదాలు చెప్పారు. సమావేశంలో ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై చర్చించడానికి మాకు అవకాశం లభించింది' అంటూ ట్వీట్ చేయగా, ప్ర ని ట్వీట్‌కు బైడెన్ స్పందించారు.. భారత్‌తో అమెరికా దేశాల భాగస్వామ్యం సన్నిహితమైంది, చైతన్యవంతమైనదని తెలిపారు. ఈ సందర్భంగా జో బైడెన్‌కు మోడీ వెండితో చేసిన రైలు నమూనాను బహుమతిగా ఇచ్చారు. ఆ రైలు నమూనాపై ఢిల్లీ టు డెలావేర్ అని రాసి ఉంది. కాగా, అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని ఆదివారం న్యూయార్క్‌కు చేరుకున్నారు. 'మోడీ & యూఎస్ ప్రోగ్రెస్ టుగెదర్' కార్యక్రమంతో పాల్గొన్నారు. ఈవెంట్‌కు ఇండో-అమెరికన్ కమ్యూనిటీ ఆఫ్ యూఎస్ఏ భారీ ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమానికి దాదాపు 14 వేల మంది హాజరయ్యారు. ప్రవాస భారతీయులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

# ఝార్ఖండ్ టు హైదరాబాద్..!

- హైదరాబాద్‌లో ఉగ్రమూలాలు
- గత నెలలో ఢిల్లీలో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అరెస్ట్
- ఐసిస్ పుణే మాడ్యూల్ లో పనిచేస్తున్న రిజ్వాన్ అబ్దుల్
- రిజ్వాన్ కొన్ని నెలలుగా హైదరాబాద్‌లో ఉన్నట్టు నిర్ధారణ
- తాజాగా సైదాబాద్ లో ఎన్ఐఏ సోదాలు

**జనపదం, బ్యూరో :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఉగ్రమూలాలు బయటపడ్డాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్‌కు చెందిన రిజ్వాన్ అబ్దుల్ కి హైదరాబాద్ తో సంబంధం ఉన్నట్లు తేలింది. ఇప్పటికే అతనికి నగరానికి చెందిన ఘోరీతో సంబంధం ఉన్నట్లు తేల్చిన ఎన్ఐఏ అధికారులు అనేక సందర్భాల్లో వారిద్దరు సంప్రదింపులు జరిపినట్లు నిర్ధారణకు వచ్చారు. ఘోరీ సహకారంతోనే అతను హైదరాబాద్‌లో సేఫ్ జోన్లో ఉన్నట్లు తెలుసుకున్నారు. ఏడాది కాలంగా పరారీలో ఉన్న రిజ్వాన్ అబ్దుల్ ను గత నెల ఢిల్లీలోని ఫరిదాబాద్ సరిహద్దు ప్రాంతంలో అరెస్ట్ చేసిన అక్కడి ప్రత్యేక విభాగం పోలీసులు న్యాయస్థానం అనుమతితో తమ కస్టడిలోకి తీసుకుని విచారించారు. ఇందులో రిజ్వాన్ అబ్దుల్ ఇచ్చిన కీలక సమాచారం మేరకు ఎన్ఐఏ అధికారులు ఆదివారం అతన్ని హైదారాబాద్ కు తీసుకువచ్చారు. దాదాపు గంటసేపు సైదాబాద్ ప్రాంతంలోని శంఖేశ్వర్ బజార్ గ్రీన్ వ్యూ అపార్ట్ మెంట్ లో సోదాలు నిర్వహించారు. అయితే ఆ సోదాల్లో లభించిన ఆధారాలను కేంద్ర నిఘా బృందం బయటికి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నది. కాగా రిజ్వాన్ అబ్దుల్ హైదరాబాద్ లో ఎన్ని రోజులు ఉన్నాడు..? ఎవరెవరిని కలిశాడు..? వారితో ఏం చర్చించాడు..? నగరంలో ఉగ్రవాద సంస్థలతో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయి..? ఉగ్రవాద సంస్థలకు ఎవరైనా ఆర్థిక సాయం చేశారా..? ఎంత మందిని ఉగ్రవాదంలో దింపాడు..? వారి నెక్ట్స్ టార్గెట్ ఏంటి..? అనే వివరాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు ఎన్ఐఏ తనిఖీలతో ఆ పరిసర ప్రాంతాల పోలీసులు అప్రమత్తమయ్యారు.




**ఝార్ఖండ్ టు హైదరాబాద్..!**

ఝార్ఖండ్ కు చెందిన రిజ్వాన్ అబ్దుల్ 2015-16లోనే డిగ్రీ పూర్తి చేసుకున్న వెంటనే ఆన్‌లైన్‌లో ఉగ్రవాద ప్రేరణ పొంది ఐసిస్‌బాట పట్టాడు. అదే సమయంలో అక్కడి నుంచి ఢిల్లీకి చేరుకున్న రిజ్వాన్ అబ్దుల్ 2017లో షహీన్ బాగ్‌కు చెందిన షానవాజ్ తో పరిచయం పెంచుకుని అతడి ద్వారా ఉగ్ర కార్యకలాపాలు కొనసాగించాడు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరఖండ్, ఝార్ఖండ్ఐసిస్‌మాడ్యుల్‌విస్తరణతో పాటు, నిధుల సేకరణ కోసం పని చేశాడు. యువతను ఆన్ లైన్ ద్వారా ఆకర్శించి పెద్ద సంఖ్యలో వారిని ఉగ్రవాదం వైపు మళ్లించాడు. ఈ క్రమంలో గతేడాది పోలీసులు పూణేలో షానవాజ్‌గుట్టురట్టు చేశారు. అదే సమయంలో పలువురిని అరెస్ట్ చేశారు. ఈ పరిణామాలతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన రిజ్వాన్ అబ్దుల్ ఉత్తరప్రదేశ్‌లోని సంభల్‌తలదాచుకున్నాడు. అప్పట్లో రిజ్వాన్ ను మోస్ట్ వాంటెండ్ గుర్తించిన ఎన్ఐఏ అతడిపై రూ.3లక్షల రివార్డును ప్రకటించింది. కాగా ఈ ఏడాది జనవరిలో రిజ్వాన్ అబ్దుల్ కదలికలను గుర్తించిన ఢిల్లీ స్పెషల్‌సెల్ పోలీసులు సంభల్ లోని అతని స్థావరంపై దాడి చేశారు. అప్పట్లో తృటిలో తప్పించుకున్న రిజ్వాన్ అబ్దుల్ హైదరాబాద్ కు వచ్చి మారు పేరుతో ఆరు నెలల సికింద్రాబాద్‌లో ఉన్నాడు. కేరళ వెళ్లిన రిజ్వాన్ అబ్దుల్ గత నెలలో ఢిల్లీకి వెళ్లగా అక్కడి పోలీసులు గంగాబక్ష్ మార్గ్ వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 30 బోర్ పిస్టల్, 3 కార్ట్రిడ్జ్ లు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

# మెగా డ్యాన్సర్..

(మొదటిపేజీ తరువాయి)

సినీ చరిత్రలో మరే నటుడికి సాధ్యం కా ని రీతిలో అత్యధిక స్టెప్పులతో గిన్నిస్ బుక్ రికార్డు నమోదు చేశారు. దీనిలో భాగంగా ఆదివారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ప్రతినిధులు హాజరైన చిరంజీవికి రికార్డును అందజేశారు. చిరంజీవి బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ చేతుల మీదుగా అం దుకున్నారు.

**తగ్గని ఇమేజ్..**

సినీ ఇండస్ట్రీలో ఎవరైనా చెప్పుకునేది.. చిరంజీవిలా డ్యాన్స్ చేయాలని, ఆయన లా నటించాలని, ఆయనలా స్వయంకృషితో ఎదగొచ్చనే ధైర్యంతో వ చ్చామనే సమాధానాలే వినిపిస్తాయి. టాలీవుడ్ మె గాస్టార్ చిరంజీవి సినీఇండస్ట్రీలో రికార్డులకు కేరాఫ్ అడ్రస్. సినిమాలకు ప దేళ్లు దూరంగా ఉన్నా ఏ మాత్రం క్రేజ్ తగ్గని స్టార్ చిరంజీవి. సినీరంగంలో 150కిపైగా చిత్రాల్లో నటించిన చిరంజీవికి విభిన్న ఆహార్యం, నటనకుగాను గి న్నిస్‌బుక్‌లో చోటు లభించింది. ఆంధ్ర ప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా మొ గల్తూరులోని మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన కొణిదెల శివ శంకర వరప్రసాద్ (చిరంజీవి)కి చిన్నప్పటి నుంచే సినిమాలపై ఆసక్తి. అలా మద్రాస్ ఫిల్మ్ ఇన్స్టిట్యూట్లో చదువుతున్నప్పుడు 'పునాదిరాళ్లు' సినిమాలో ఛాన్స్ దక్కించుకున్నారు. ఇక ఆ తర్వాత వెనక్కితిరిగి చూసుకోకుండా వరుస సినిమాలతో ప్రేక్ష కుల ముందుకు వచ్చారు. ఈ క్రమం లోనే 'నటన అంటే కమల్ హాసన్, స్టైల్ అంటే రజనీకాంత్ ఈ రెండూ ఉన్న కథానాయకుడు మెగాస్టార్!' అనేంతలా ఎదిగారు. అలా ఒక్కోమెట్టు ఎక్కుతూ లక్షలాదిమంది ప్రేక్షకుల అభిమానం సంపాదించారు. 90ల్లో డ్యాన్స్ అంటే చిరంజీవిదే. సినిమాల్లో ఎనర్జిటిక్ డ్యాన్సో ఆడియెన్స్ను అలరించేవారు. యాక్షన్ సీన్సో మాస్ ప్రేక్షకుల్ని కూడా తనవైపు తిప్పుకున్నారు. ఫైట్స్, డ్యాన్స్, డైలాగ్స్ ఇలా అన్నింట్లో తనదైన మార్క్ చూపించి ఆల్రౌండర్గా గుర్తింపు తెచ్చుకున్నారు.

**ఇప్పటికే రికార్డులు..**

'జగదేక వీరుడు అతిలోక సుందరి', 'రౌడీ అల్లుడు', 'గ్యాంగ్ లీడర్' వంటి సినిమాలతో టాలీవుడ్ ఇండస్ట్రీ రేంజ్ పెంచారు. ఈ క్రమంలోనే మెగాస్టార్ అనేక రికార్డులు సృష్టించారు. 'ఇంద్ర', 'ఠాగూర్', 'శంకర్ దాదా ఎం.బి.బి.ఎస్', 'స్టాలిన్' సినిమాలతో సంచలన విజ యాల్ని అందుకున్నారు. ఇక 2007 త ర్వాత సినిమాలకు బ్రేక్ ఇచ్చారు. ఆ త ర్వాత సెకండ్ హాఫ్లోనూ జోరు పెంచారు. దాదాపు 10ఏళ్ల తర్వాత మెగాస్టార్ 'ఖైదీ నెం.150' సినిమాతో బిగ్ స్క్రీన్పై సందడి చేశారు. రీఎంట్రీలో తొలి సినిమాతోనే పలు రికార్డులు బద్దలుకొట్టి, ఆయన ఇమేజ్ ఏ మాత్రం తగ్గలేదని నిరూపించారు. ఆ తర్వాత 'సైరా నరసింహారెడ్డి', 'గాడ్ ఫాదర్', 'వాల్తేరు వీరయ్య', 'భోళా శంకర్'తో సెకండ్ హాఫ్లోనూ జోరు చూపిస్తున్నారు. ప్రస్తు తం ఆయన బింబిసార ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో 'విశ్వంభర' చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవిని 2006లో అప్పటి భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవా ర్డుతో సత్కరించింది. అదే ఏడాది ఆంధ్రా విశ్వ విద్యాలయం నుంచి గౌరవ డాక్టరే ట్‌ని కూడా అందుకున్నారు. 2016లో ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య పురస్కారాన్ని అందుకున్నారు. 'స్వయం కృషి', 'ఆపద్బాంధవుడు', 'ఇంద్ర' సినిమాలకుగానూ ఉత్తమ నటుడిగా నంది పురస్కారా లు సొంతం చేసుకున్నారు. ఇక 2022లో భారత ప్రభుత్వం నుంచి ఇండియన్ ఫిలిం పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ పురస్కారం కూడా దక్కింది. 2024 జనవరిలో కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మ విభుషణ్ అవార్డుతో సత్కరించింది.

**గిన్నిస్ రికార్డులో ఇప్పుడు..!**

చిరంజీవి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. భారతీయ సినీ చరిత్రలో ఒక అ పురూపమైన నటుడు అని గుర్తిస్తూ ఆయనకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ సముచిత స్థానం కల్పించింది. తన సుదీర్ఘ సినీ కెరీర్ లో 156 సినిమాల్లో 537 పాటల్లో 24,000 డాన్స్ మూవ్స్ చేసినందుకు గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో మె గాస్టార్ చిరంజీవి పేరు నమోదైంది. ఆదివారం హైదరాబాదులోని ఐటీసీ కోహినూర్ హోటల్ లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రకటన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి చిరంజీవి, గిన్నిస్ బుక్ ప్రతినిధులు, బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్, టాలీ వుడ్ ప్రముఖులు, మెగా కుటుంబ సభ్యులు, ఇతర రంగాలకు చెందినవారు హాజరయ్యారు. బాలీవుడ్ నటుడు ఆమీర్ ఖాన్ చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ ను చిరంజీవి అందుకున్నారు.

**డ్యాన్స్ అంటేనే చిరంజీవి..**

డాన్స్ అంటే మెగాస్టార్, మెగాస్టార్ అంటే డాన్స్. వెండితెరపై నృత్యానికి పర్యాయపదంగా నిలిచిన చిరంజీవి డాన్స్ స్టెప్స్ లకు ప్రత్యేక గుర్తింపునిస్తూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఇవాళ అవార్డును అందజేయడం తెలుగువారందరికీ గర్వకారణం. ఈ సందర్భంగా పద్మవిభూషణ్ చిరంజీవికి హృదయపూర్వక శుభాకాంక్షలు. 46ఏళ్ల సినీ ప్రయాణంలో 156 సినిమాల్లో 537 పాటలలో, 24,000 డ్యాన్స్ స్టెప్స్ వేసిన రికార్డు చిరంజీవికి మాత్రమే సొంతం. 1978 సంవత్సరంలో మొదటి సినిమా ప్రాణం ఖరీదు విడుదలైన సెప్టెంబర్ 22 వ తేదీనే ఈ అవార్డు అందుకోవడం యాదృశ్చికం. భవిష్యత్తులో మరెన్నో అవార్డులు మెగాస్టార్ సొంతం కావాలని, యువ కళాకారులలో మరింత స్ఫూర్తిని నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**అందుకే గిన్నిస్ రికార్డు.. : చిరంజీవి**

తాజాగా గిన్నీస్ రికార్డు అందుకున్న చిరంజీవి మాట్లాడుతూ, తాను ఎదురు చూడని గొప్ప గౌరవం ఇది అని అభివర్ణించారు. నటన మీద కన్నా డాన్స్ మీద నాకున్న ఇష్టమే ఈ గిన్నిస్ అవార్డు రావడానికి కారణం అనుకుంటా అని వివరించారు. ఇదే వేదికపై డ్యాన్స్ కు సంబంధించిన ఆసక్తికర విషయాలు అందరితో షేర్ చేసుకున్నాడు. తాను ఊహించనిది ఈ ఈవెంట్ ఇంత గ్లామర్‌గా మెమెరబుల్‌గా ఉందంటే కారణం తన మిత్రుడు అమీర్‌ఖాన్ అని ధన్యవాదాలు చెప్పారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ తానెప్పుడూ ఊహించనిదని, గిన్నిస్ బుక్‌కు మనకు ఏం సంబంధమనే ఆలోచన ఉంటుందని, తనకు కూడా అలాంటి ఆలోచన ఏం లేదని, అలాంటిది ఎదురుచూడని గొప్ప గౌరవం తన సినీ ప్రస్థానంలో తారసపడినందుకు ఆ భగవంతుడికి.. దానికి కారణభూతులైన నా దర్శకనిర్మాతలు, అభిమానులకు ఎప్పుడు రుణపడి ఉంటానని చిరంజీవి చెప్పుకొచ్చారు.

"నాకు నటన కంటే కూడా డ్యాన్స్ మీదున్న ఆసక్తి ఈ రోజు ఈ అవార్డ్ వచ్చేలా చేసిందా అని నాకనిపిస్తుంటుంది. ఎందుకంటే నేను నటనకు శ్రీకారం చుట్టేకంటే ముందు డ్యాన్స్‌కు ఓనమాలు దిద్దానేమోననిపిస్తూ ఉంటుంది. నా చిన్నప్పుడు మా చుట్టున్నవాళ్లను ఎంటర్‌టైన్ చేయడం కోసం అప్పట్లో ఉండే వివిధ భారతి, రేడియో సిలోన్ (శ్రీలంక రేడియో స్టేషన్ ) కానీ.. వీటిలో వచ్చే తెలుగు పాటలు మాకు ఇన్‌స్పిరేషన్. అప్పట్లో ఆర్థికంగా గ్రామ్‌ఫోన్, టేప్ రికార్డర్ కానీ ఉండే పరిస్థితి లేదు. ఒక్కోసారి రేడియోలో పాటలు ఎప్పుడొస్తాయని అందరూ ఎదురుచూసేవారు. రాగానే శంకర్ బాబును పిలవండి.. డ్యాన్స్ చేస్తాడు.. మనల్ని అలరిస్తాడని వాళ్లంతా ఉత్సాహంగా ఉంటే.. నేను ప్రోత్సాహంగా తీసుకొని డ్యాన్స్ చేస్తుండేవాడిని" అంటూ చిరంజీవి గద్గదస్వరంతో చెప్పారు.



# కాంట్రాక్టర్‌కు అప్పజెప్పితే ఖతమే..

- లాభాల వాటాలో కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5000 బోనస్
- పంపిణీ పేరుతో భారీ కుంభకోణం.?
- అక్రమాలకు తెరలేపిన గుర్తింపు సంఘాలు..
- యాజమాన్యమే ఖాతాల్లో వేయాలని వినతి

**జనపదం,బ్యూరో:** సింగరేణి సంస్థకు 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించడంలో రూ4 వేల కోట్లకు పైగా లాభాలు వచ్చాయి. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం గుర్తింపు కార్మిక సంఘం ప్రాతినిధ్య సంఘాలు కార్మికులకు లాభాల వాటా 33శాతం ఇస్తున్నట్లు ప్రకటించి, కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో నుంచి రూ.5 వేలు ఇప్పించేందుకు అంగీకరించినట్లు ప్రకటించారు. కానీ లాభాల బోనస్ రూ.5 వేల చెల్లింపు పేరుతో కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటాను ఏ రూపంలో వారికి అందజేస్తారనేది అర్థం కాని ప్రశ్నగా మారింది.

**ఎవరెవరికి..?**

రూ. 5 వేల బోనస్ ఎంతమంది కాంట్రాక్టు కార్మికులకు పంపిణీ చేస్తారు.. ఇందుకు ఎన్ని కోట్లు కేటాయిస్తారు.. అసలు ఎవరెవరికి వర్తింపజేస్తారు.. అసలు వారి బ్యాంక్ అకౌంట్ వివరాలు యాజమాన్యం దగ్గరకి ఎలా వస్తాయనేది తెలియదం లేదని పలువురు కార్మికులు వాపోతున్నారు. ప్రస్తుతం సింగరేణి లో ఈ ప్రశ్నలు తలెత్తడానికి కారణాలు సైతం లేకపోలేదు. యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించాలంటే వారి బ్యాంక్ ఖాతాల వివరాలు యాజమాన్యం దగ్గర ఉండాలి. కానీ వాస్తవానికి యాజమాన్యం వారికి జీతాలే చెల్లించదని, వారికి జీతాలు ఇచ్చేది కాంట్రాక్టర్ అలాంటప్పుడు వీరికి ఎలా అందజేస్తారు? లేదా కాంట్రాక్టర్ కే ఆ డబ్బులు ఇచ్చి వారికి అందేలా చేస్తారా? హై పవర్ కమిటీ పేరుతో ఉన్న జీతాలే వారికి సరిగ్గా ఇవ్వని కాంట్రాక్టర్లు ఇప్పుడు ఈ బోనస్ వారికి ఇస్తారా? పైగా ఎంత మందికి ఈ బోనస్ ప్రయోజనం అందుతుందో చెప్పకపోవడం కొసమెరుపు.

**కుంభకోణానికి తెర..?**

సింగరేణి సంస్థలో కాంట్రాక్టు కార్మికులు అసలు ఎంతమంది ఉన్నారో కూడా ఎవరికీ అవగాహన లేదు. కొన్ని సందర్భాల్లో గేటు మీటింగ్లలో సింగరేణి కార్మికుల కన్నా కాంట్రాక్టు కార్మికుల సంఖ్యఎక్కువ అని చెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి. అంటే ఇప్పుడు సుమారు 50 వేల నుంచి 70 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉండొచ్చు. మరి అంత మందికి బోనస్ ఇస్తారా.! అసలు కాంట్రాక్టు కార్మికులు అంటే ఎవరెవరికి ఇది వర్తింప చేస్తారు. ఓసీపీలో ఓబీ తీసే కాంట్రాక్టు వర్కర్లు కూడా సింగరేణిలో భాగామే కదా. మరి వారికి కూడా దీన్ని వర్తింప చేస్తారా.? ఇలా ఎన్నో ప్రశ్నలు.! ముఖ్యంగా నేరుగా ఈ డబ్బులు వారి ఖాతాల్లో కాకుండా కాంట్రాక్టర్ కు అప్పజెప్పితే మాత్రం పెద్ద కుంభకోణానికి తెర లేపినట్టేనని పలువురు భావిస్తున్నారు.. పైగా కాంట్రాక్టు వ్యవస్థకు వ్యతిరేకంగా అని చెప్పుకుంటునే కాంట్రాక్టర్లకు మేలు చేసేలా గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు కుట్రకు తెరలేపారు. కాంట్రాక్టు కార్మికుల పేరు చెప్పి ఆ డబ్బులు వారికి అందకుండా మధ్యలోనే స్వాహా అయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని కాంట్రాక్టు కార్మికుల వాదన. కాబట్టి యాజమాన్యం వారి ఖాతాల వివరాలు తీసుకొని నేరుగా వారికి బోనస్ లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని, లేదంటే ఇందులో కుంభకోణానికి లేపిన వారవుతారని వాదనలు సర్వత్రా వస్తున్నాయి.

# అది బోనస్ కాదు.. బోగస్..

- సింగరేణి కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్న కాంగ్రెస్
- నికర లాభం రూ. 4701 కోట్లలో 33 శాతం వాటా రూ. 1551 కోట్లు ఇవ్వాలి
- ఇచ్చింది రూ.796 కోట్లే
- అంతే ఇచ్చిన బోసన్ 33 శాతం కాదు.. 16.9 శాతమే
- పండుగ వేళ కార్మికుల పొట్టకొడుతుంది
- ధ్వజమెత్తిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**జనపదం, బ్యూరో :** సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది బోనస్ కాదు.. బోగస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. లాభాల బోనస్ అంతా ఉత్తితేదనని అన్నారు. ప్రతి సింగరేణి కార్మికుడికి కనీసం రూ.లక్షా 80 వేలు లాస్..! అని పేర్కొన్నారు. సంస్థ కార్మికుల కష్టాన్ని కాంగ్రెస్ సర్కార్ దోచుకుంటోందని విమర్శించారు. దసరా పండుగ వేళ..ప్రభుత్వం కార్మి కుల పొట్ట కొడుతోందని మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సింగరేణి సంస్థకు వచ్చిన నికర లాభం రూ. 4701 కోట్లలో న్యాయంగా 33 శాతం వాటా కింద రూ. 1551 కోట్ల బోనస్ చెల్లించాలన్నారు. ఈ లెక్కన ప్రతి కార్మికుడికి 3.70 లక్షలు రావాలన్నారు. కానీ ప్రభుత్వం ప్రకటించిన బోనస్ కేవలం రూ. 796 కోట్లు మాత్రమేనని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే బోనస్ కేవలం 16.9 శాతం మాత్రమేనని ఒప్పుకోవాలన్నారు. అంతేతప్ప 33 శాతం అంటూ కార్మి కుల లాభాల వాటాపై అసత్యాలు చెప్పవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న మొత్తం పది సంవత్సరాల్లో కార్మి కులకు లాభాల వాటా రూపంలో దక్కింది కేవలం రూ. 365 కోట్ల మాత్రమేనని అన్నారు. కానీ బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లో లాభాల వాటా రూపంలో సింగరేణి కార్మి కులకు అందించింది రూ. 2780 కోట్ల అని తెలిపారు. అంటే బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లో సింగరేణి అద్భుతమైన ప్రగతి సాధించిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సింగరేణి కార్మికులకు సంస్థ లాభాలు పది, పదిహేను శాతానికి మించి ఏనాడు ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భారీగా లాభాలను పెరిగేలా సంస్థ పనితీరును పెంచామన్నారు. ఒక్కొక్క కార్మికుడికి కార్మికులకు అత్యధికంగా 32 శాతం వాటా ఇచ్చామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో వచ్చే నాటికి రూ. 17వేల లాభాల వాటా ఉంటే, తాము అధికారంలోకి దిగిపోయినాటికి రూ.1.70 లక్షల వరకు ప్రతి కార్మికుడికి లాభాల వాటా ఇచ్చామన్నారు. కానీ సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికులు కాంగ్రెస్ నేతలను మాటలను విశ్వసించి ఆ పార్టీ అనుబంధ సంఘాన్ని గెలిపించినందుకు భారీగా బోనస్ కోల్పోయారన్నారు. సింగరేణి ప్రాంతంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన కార్మికలోకానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బహుమానమా? ఇది అని కేటీఆర్ ప్రశ్నించారు. కార్మికలోకానికి ముందే తాము హెచ్చరించామన్నారు. ప్రస్తుతం కార్మికుల హక్కులకు పూర్తిగా భంగం కలిగించేలా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణి ప్రైవేటీకరిస్తుందని కూడా ముందే చెప్పామన్నారు. లాభాల్లో కార్మికుల వాటా తగ్గించడం అంటే, భవిష్యత్తుతో సింగరేణి కార్మికుల ఆత్మస్థైర్యాన్ని, భాగస్వామ్యాన్ని తగ్గించి సింగరేణి ప్రైవేటీకరించే కుట్రగానే భావిస్తున్నామన్నారు. సింగరేణి లాభాల వాటాపైన సింగరేణి కార్మికులు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేల పై ఒత్తిడి తీసుకురావాలన్నారు. సింగరేణి ప్రాంతంలో గెలిసిన 13 మంది ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి దగ్గరికి పంపించండన్నారు. సింగరేణి ప్రాంత మంత్రులు ఎమ్మెల్యేలు ఈ అంశంలో స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి అధికార గుర్తింపు సంఘంతో పాటు, కునంనేని సాంబశివరావు, బీజేపీ నేతల కూడా ఈ అంశంలో స్పందించాలన్నారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ కు చెందిన సింగరేణి బొగ్గు గని కార్మిక సంఘం ద్వారా ఈ అంశంలో పోరాటం చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు..

# తిరుమల నెయ్యి ట్యాంకర్లకు జీపీఎస్, ఎలక్ట్రిక్ లాకింగ్

- ఓటీపీ ఎంటర్ చేస్తేనే ఓపెన్
- అధికార పకడ్బందీ నిఘా




**జనపదం, తిరుపతి :** తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీపై కల్తీ కాటు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గతకొన్ని రోజులుగా నడుస్తున్న లడ్డూ లడాయి తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. కాగా, తిరుపతి లడ్డూకు 20 ఏళ్లుగా స్వచ్ఛమైన నందిని నెయ్యి వాడేవారు. కానీ, 2023లో గత పాలకులు ధరల సమస్యను కారణంగా చూపుతూ నందిని నెయ్యి సప్లై ఆపేశారు. తాజా వివాదంతో తిరుమలకు స్వచ్ఛమైన నందిని నెయ్యిని మాత్రమే వాడాలని ఏపీలోని కూటమి సర్కార్ నిర్ణయించింది. ఈ సమయంలో తిరుమలకు పంపే నందిని ఆవు నెయ్యి విషయంలో కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ఆలయాన్ని పర్యవేక్షించే తిరుమల తిరుపతి దేవస్థానానికి నెయ్యి పంపిణీ చేసే వాహనాలకు జియో-పొజిషనింగ్ సిస్టమ్‌ని ఏర్పాటు చేసింది. నెల రోజుల క్రితం టీటీడీ కేఎంఎఫ్‌కు టెండర్ ఇవ్వడంతో నందిని నెయ్యి సరఫరాను పునరుద్ధరించినట్లు కేఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎంకే జగదీశ్ ధృవీకరించారు. తిరుమలకు పంపే నందిని ఆవు నెయ్యి ట్యాంకర్లకు జీపీఎస్, ఎలక్ట్రిక్ లాకింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ అధికారులు తెలిపారు.

## ఓటీపీ ఎంటర్ చేస్తేనే..

ఎలక్ట్రిక్ లాకింగ్ వల్ల మార్గమధ్యలో ఎవరూ ట్యాంకర్‌ను ఓపెన్ చేయలేరని, టీటీడీ అధికారులు ఓటీపీ ఎంటర్ చేస్తేనే ఓపెన్ అవుతుందని పేర్కొన్నారు. టీటీడీకి నెల రోజుల క్రితం నెయ్యి సరఫరాను పునరుద్ధరించామని వివరించారు. తమ వాహనాలు ఎక్కడ ఆగిపోయాయో కనుక్కోవడానికి జీపీఎస్, జియో లొకేషన్ డివైజ్‌లను అమర్చినట్లు జగదీష్ వివరించారు. రవాణా సమయంలో కల్తీ జరగకుండా చూసేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా, ఆలయ అవసరాల కోసం 350 టన్నుల నెయ్యి సరఫరా చేసేందుకు కేఎంఎఫ్‌తో ఒప్పందం కుదిరింది.

# పాక్‌తో చర్చల్లేవ్..



- ఆర్టికల్ 370ని ఎవ్వరూ తిరిగి తీసుకురాలేరు
- స్పష్టం చేసిన కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షా
- జమ్ము కశ్మీర్‌లో ఎన్నికల ప్రచారం

**జనపదం, బ్యూరో:** ఉగ్రవాదం అంతమయ్యే వరకు పాకిస్థాన్‌తో చర్చలు జరిపే అవకాశమే లేదని కేంద్రహోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని ఎవరూ పునరుద్ధరించలేరని ఆయ పునరుద్ఘాటించారు. రాజౌరీ జిల్లా నౌషేరాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. కొందరు పాకిస్థాన్‌తో చర్చలు జరపాలని బలంగా కోరుకుంటున్నారని, కానీ, ఉగ్రవాదం అంతమయ్యే వరకు వారితో ఎలాంటి చర్చలు జరిపేది లేదన్నారు. దేశంపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను జైలు నుంచి విడుదల చేయాలని వారు (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) కోరుకుంటున్నారని, కానీ, మోదీ సర్కార్ అలా ఎన్నటికీ చేయదని, భారత ప్రజలపై రాళ్లు రువ్విన వారికి కారాగారం నుంచి విముక్తి కల్పించేది లేదని షా మరోసారి స్పష్టం చేశారు.

## జమ్ముకశ్మీర్‌లో రెపరెపలాడేది త్రివర్ణ పతాకమే ..

ఆర్టికల్ 370ని తిరిగి తీసుకువస్తామని ఫరూక్ అబ్దుల్లా చెప్పారని,దానిని ఎవరూ తిరిగి తీసుకురాలేరని అమిత్‌షా స్పష్టం చేశారు. ఇప్పుడు, బంకర్లు అవసరం లేదని, అక్కడి నుంచి బుల్లెట్ వస్తే, బుల్లెట్లతోనే సమాధానం చెబుతామన్నారు. వాళ్లు షేక్ అబ్దుల్లా జెండాను తిరిగి తీసుకురావాలనుకుంటున్నారని, అయితే జమ్ముకశ్మీర్‌లో త్రివర్ణ పతాకం మాత్రమే రెపరెపలాడుతోందని స్పష్టం చేశారు. ఇక్కడ ఉగ్రవాదం తీవ్రంగా ఉందని, 30 ఏళ్లలో 3000 రోజులు కర్ఫ్యూ విధించగా, 40,000 మంది మరణించారన్నారు. ఆ రోజుల్లో కశ్మీర్ కాలిపోతున్నప్పుడు ఫరూక్ సాబ్ లండన్‌లో హాయిగా సెలవు ఎంజాయ్ చేశారని షా తీవ్రంగా విమర్శించారు.

## హామీలను నిలబెట్టుకుంటాం..

కాంగ్రెస్, ఎన్‌సీపీ, పీడీపీ కొండ ప్రాంతాల్లో నివసించే వారికి రిజర్వేషన్లను తీసేశారని, అయినా మోదీ వారికి రిజర్వేషన్ కల్పించేలా చేస్తున్నారని అమిత్‌షా అన్నారు. కొండ ప్రాంత ప్రజలకు రిజర్వేషన్ కల్పించినప్పుడు. మీ రిజర్వేషన్ తీసేస్తారు అని ఫరూఖ్ సాబ్ ఇక్కడి గుర్జర్ సోదరులను రెచ్చగొట్టడం మొదలుపెట్టారు. గుజ్జర్ బకర్వాల్ రిజర్వేషన్ ఒక్క శాతం కూడా తగ్గించబోమని రాజౌరీలో మేమిచ్చిన హామీని నిలబెట్టుకున్నాము. కాంగ్రెస్, ఎన్ సీ, పీడీపీ రిజర్వేషన్ హక్కులను ఏళ్ల తరబడి హరించాయని షా మండిపడ్డారు.

## గొడవలు సృష్టించి అనుకున్నది సాధిస్తారు..

విపక్షాలు ప్రేమ దుకాణంలో, ద్వేషం సామాన్లు అమ్మే పని చేస్తారని, రెండు కులాలు గొడవపడేలా చేసి, వారు అనుకున్నది సాధించేందుకు సమాజాన్ని విభజిస్తారని అమిత్ షా తీవ్రంగా విమర్శించారు. అలాంటి పార్టీలు దేశ వ్యతిరేక శక్తులని, ఎన్‌సీ, కాంగ్రెస్ పాకిస్థాన్‌రక్షణ మంత్రి నుంచి సర్టిఫికెట్ అందుకున్నాయని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో అవినీతి అంతం కాగా, దేశం పురోగతి సాధించిందని జగత్ ప్రకాష్ నడ్డా అన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ కశ్మీర్ లో పదేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికలపైనే అందరి దృష్టి ఉందన్నారు. జమ్ముకశ్మీర్‌లో 58శాతానికి పైగా, లద్దాఖ్‌లో 82శాతం కంటే ఎక్కువ ఓటింగ్ నమోదైందని, జమ్ముకశ్మీర్‌మారుతోందనేందుకు ఇది నిదర్శనమన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో అన్నీ స్కాములే..

- తెలంగాణలో ఆ పార్టీ చచ్చిపోతోంది..
- రూ.8888 వేల కోట్లు ఎక్కడివో కేటీఆర్ చెప్పాలి
- కేసీఆర్ కుంటుబం రూ.2 లక్షల కోట్లను దోచుకుంది..
- బీఆర్ఎస్‌లో ప్రతిపక్ష నాయకుడెవరో తేల్చాలి
- సీఎం రేవంత్‌పై నిరాధార ఆరోపణలు సరికావు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**జనపదం, యాదాద్రి :** బీఆర్ఎస్ పార్టీ హయాంలో అన్నీ అక్రమాలు, కుంభకోణాలేనని, తెలంగాణలో రోజురోజుకూ ఆ పార్టీ చచ్చిపోతోందని, కనీసం ప్రతిపక్ష నాయకుడు కూడా ఎవరో తెలియదని రాష్ట్ర రోడ్డు భవనాల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆహ్వానం మేరకు ఆదివారం ఆలేరు మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఆలేరు పట్టణంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్‌లు పార్టీ వదిలిపెట్టి పోతుండడంతో దిక్కుతోచని స్థితిలో కేటీఆర్ మాట్లాడుతున్నాడని వ్యాఖ్యానించారు. కేటీఆర్ పది ఏండ్లు మున్సిపల్ శాఖ మంత్రిగా పని చేసి ఏడు లక్షల కోట్లు అప్పులు చేసి రెండు లక్షల కోట్ల ఆయన కుటుంబం దోచుకుందని ఆరోపించారు. రూ.8888 వేల కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయి కేటీఆర్ లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం స్కామ్ చేశారని, మేడిగడ్డ కూలిపోయిందని, ఎప్పుడు ఎవరు జైలుకు పోతారో తెలియదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఉన్న ప్రభాకర్ రావును అమెరికా నుంచి రావద్దని కేటీఆర్, హరీష్ రావు అమెరికాకు పోయి చెప్పి వచ్చారని ఆరోపించారు. ప్రభాకర్ రావు వస్తే వీళ్లు జైలుకు పోతారని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ దుకాణం బంద్ అయిందని చెప్పి తమ ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ కు దమ్ముంటే రుజువు చేయాలని డిమాండ్ చేశారు. మంచి పనులు చేసిన కేటీఆర్ కు దోపిడే కనిపిస్తుందని, ఆయన కుటుంబం లాగా దోచుకోరని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదని, కాని తమ పాలనలో ఒకటో తేదీనే జీతం ఇస్తున్నామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఒక్క స్థానం కూడా రాదని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఎక్కడిది, ప్రతిపక్ష నాయకుడు నువ్వా లేక మీ నాయనాన లేక హరీష్ రావా, మీ చెల్లెన, నువ్వా కేటీఆర్ ముందు అది తేల్చుకో అంటు డిమాండ్ చేశారు. మీరు నలుగురు కలిసి ప్రతిపక్ష నేత పాత్ర కోసం పోటీ పడుతున్నారని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ తరపున మార్కెట్ కమిటీలకు మంచి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఆలేరు మార్కెట్ కమిటీకి అవసరమైన గోదాములను మంజూరు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అయిన చైతన్య మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ మదర్ గౌడ్, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 29న మంజీరా రచయితల సంఘం 38వ వార్షికోత్సవం..

- హాజరు కానున్న మాజీ మంత్రి హరీశ్ రావు
- సభలో పలు కవితా సంకలనాలు ఆవిష్కరణ..

**జనపదం, సిద్దిపేట :** మంజీరా రచయితల సంఘం 38 వ వార్షికోత్సవం ఈ నెల 29 ఆదివారం సిద్దిపేట లో జరుగుతుందని మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కె. రంగాచారి, ప్రధాన కార్యదర్శి సిద్దెంకి యాదగిరి తెలిపారు. ఇందుకు సబంధించిన కరపత్రాలను ఆధివారం వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సిద్దిపేట విపంచి ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం అవుతుందని, ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొంటారని తెలిపారు. ప్రారంభోపన్యాసకులుగా ప్రముఖ సాహితీ వేత్త, ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్, విశిష్ట అతిథిగా ప్రఖ్యాత కవి, కబీర్ సమ్మాన్ పురస్కార గ్రహీత కె.శివారెడ్డి, ఆత్మీయ అతిథులుగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఉద్యోగ సంఘాల మాజీ నేత దేవీ ప్రసాద్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నేత కె. విరాహత్ అలీ, జి.తిరుపతి రెడ్డి, జి.పాపయ్య, గ్యాదరి పరమేశ్వర్ హాజరవుతారన్నారు. రెండో సభ సాహితీ వేత్తలు దాశరథి, ఆరుద్ర, బిరుదురాజు రామరాజు శతజయంతి సందర్భంలో జరుగుతుందని తెలిపారు ఈ సభలో 'ఆరుద్ర సాహితీ స్ఫూర్తి' అనే అంశం పై ప్రఖ్యాత కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి, 'బిరుదురాజు రామరాజు పరిశోధనలు సాహిత్యం' అనే అంశంపై ప్రొఫెసర్ కాశీం, 'దాశరథి కవితా చైతన్యం' అనే అంశంపై ప్రముఖ కవి గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రసంగిస్తారని తెలిపారు.. అనంతరం మరసం కవులతో కవి సమ్మేళనం ఉంటుందన్నారు. ఈ సభల్లో మరసం కవుల కవితా సంకలనం జోట పాటలు, సిద్దెంకి యాదగిరి కథా సంకలనం మూడు గుడిసేల పల్లె, పిట్టల మధు కవితా సంకలనం మధు గాయాలు కవితా సంకలనం ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. సభలో షేక్ బాబా, అక్కారం సత్తయ్య, జహంగీర్ కళాబృందాలచే సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

# ముంబై పోలీసులమంటూ మోసం

- రూ. 1.43 కోట్లు వసూలు
- రామగుండం సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో విచారణ
- సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన



**జనపదం, బ్యూరో :** 'మేం ముంబై పోలీసులం.. మీరు మనీ లాండరింగ్ కేసులో ఉన్నారు. కేసునుంచి బయట పడాలంటే నేను చెప్పిన అకౌంట్ నెంబర్ కి చెప్పినంత అమౌంట్ ని పంపించాలి. మేము మీ డబ్బును చెక్ చేసిన తర్వాత మీ అకౌంట్ కి తిరిగి పంపిస్తాము. మా మాట వినకపోతే జైలు కి వెళ్తావు.' అని బెదిరించగా అతడి మాటలు నమ్మి విడత వారీగా రూ.1,43,75,000 పంపినాడు తర్వాత తాను సైబర్ ఫ్రాడ్ అయ్యిందని తెలుసుకొని అప్పుడు 1930 కి కాల్ చేయడం జరిగింది. తర్వాత తాను సైబర్ మోసానికి బలయ్యానికి తెలుసుకుని 1930 కి కాల్ చేశాడు. ఈ క్రమంలో డీజీపీ షికా గోయల్ ఆధ్వర్యంలో రామగుండం సీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటరమణ, ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ టీం విచారణ ప్రారంభించారు. సైబర్ మోసగాళ్లు బాధితుడి సెల్ ఫోన్ కు జూలై 22, 2024 న కాల్ చేసి బెదిరించారు. 1930 ద్వారా ఫిర్యాదు అందుకున్న డీఎస్పీ వెంకటరమణ తన టీం ఆధ్వర్యంలో మహారాష్ట్ర దేవుపేట్ వాసిం జిల్లాలో ఉంటున్న సంతోష్ శ్రీకృష్ణ నాగల్కర్ పట్టుకొని విచారించి, అతని నుంచి మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నేరస్తుడు తన దగ్గర ఉన్న మరో నేరస్తుడి ఫోన్ నెంబర్ చూపించాడు. బ్యాంక్ అకౌంట్ లను ట్రాన్సక్షన్స్ ట్రాన్సఫర్లను కమీషన్ కింద కొంత డబ్బులకు అమ్ముకునే సదరు నేరస్తుడి బ్యాంక్ అకౌంట్ లో దేశంలో పద్దెనిమిది నేరాలలో ఉపయోగించాడని తెలిసింది. అయితే ఎంత అమౌంట్ ట్రాన్స్ ఫర్ అయింది.. ఎన్నికేసులలో ఈ బ్యాంకు అకౌంట్స్ ఉపయోగించారు.. ఈ నేరాల్లో ఎంత మంది పాల్గొన్నారు.. ఇంకా తెలియాల్సి ఉంది. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ప్రజలను పోలీస్ వాళ్లమని ఫోన్ చేసి భయభ్రాంతులకు గురి చేసి పెద్ద మొత్తంలో డబ్బును కాజేస్తున్నారని, అలాంటివారి మాటలను నమ్మొద్దని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 41శాతం నేరాలు ఎక్కువగా ఇవే జరుగుతున్నాయని, సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని, లేదా www.cybercrime.gov.in పోర్టల్ లో లాగిన్ అయ్యి పిటిషన్ జనరేట్ చేయాలన్నారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష రాయితో రుణమాఫీ మీద సోషల్ మీడియా మేలు apk ఫైల్ ద్వారా లింకులు వస్తున్నాయని, వాటిని ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయొద్దని డీఎస్పీ వెంకటరమణ తెలిపారు.

# చెట్ల తొలగింపు అవాస్తవం

- దామగుండం అడవిలోని కొన్ని చెట్లనే తొలగిస్తాం
- కోల్పోనున్న వాటికి బదులుగా నాటుతాం
- 48 శాతం అటవీ విస్తీర్ణంలోనే రాడార్ స్టేషన్
- పీసీసీఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్




**జనపదం, హైదరాబాద్ సిటీ:** వికారాబాద్‌లోని దామగుండం అడవుల్లో తూర్పు నౌకాదళ రాడార్ స్టేషన్ ను నెలకొల్పేందుకు 12 లక్షల చెట్లను తొలిగించనున్నారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధానాధికారి(పీసీసీఎఫ్) రాకేష్ మోహన్ డోబ్రియాల్ తెలిపారు. రాడార్ ఏర్పాటు కోసం 12 లక్షల చెట్లను తొలిగించనున్నారని వ్యాపి న్న వార్తలు నిరాధారమైనవని ఆయన ఖండించారు. రాడార్ ప్రాజెక్టు నిర్మాణ కోసం కేటాయించిన మొత్తం అటవీ భూముల్లో 48% విస్తీర్ణం మాత్రమే రాడార్ స్టేషన్ నిర్మాణానికి ఉపయోగించబడుతుందని ఆయన వివరించారు. మిగిలిన 52% విస్తీర్ణంలోని అటవీ సంపదకు ఎలాంటి హానీ జరగకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. 48 శాతం అటవీ భూమి లోనూ కేవలం రాడార్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన కొన్ని చెట్లను మాత్రమే తొలగించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. స్టేషన్ నిర్మాణానికి 12 లక్షల చెట్లను తొలగించనున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆయన తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్ మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ కు అనుబంధంగా పనిచేసే ఫారెస్ట్ అడ్వైజరీ అథారిటి 1,93,562 చెట్లను మాత్రమే రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం తొలిగించడం జరుగుతుందని స్పష్టం చేసిందన్నారు. రాడార్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించిన తర్వాత తొలిగించాలనుకున్న చెట్ల సంఖ్యను ఇంకా తగ్గించే దిశగా అటవీ శాఖ ప్రణాళికలు రచిస్తున్నదని ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో కోల్పోనున్న 1,93,562 చెట్లకు బదులుగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అడవుల్లోని 2,348 హెక్టార్లలో విస్తరించి వున్న 17,55,070 చెట్లను అటవీశాఖ పునరుద్ధరించనుందని అని డోబ్రియాల్ తెలిపారు.

## ముందే తీర్మానం..

ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ ప్రకారం రాడార్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సంబంధిత గ్రామాలతో పాటు, గ్రామ సభల ముందు పెట్టి ఈ ప్రాజెక్టుకు అనుకూలంగా తీర్మానాలు, షెడ్యూల్ తెగలు సహా ఇతర సాంప్రదాయ అటవీ నివాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగటం లేదని జిల్లా కలెక్టర్ నుంచి ఆమోదం పొందిన తర్వాతనే పనులు చేపట్టడం జరుగుతుందని డోబ్రియాల్ వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ కోసం భారత ప్రభుత్వం 2010 నుండే చర్యలు చేపట్టడం జరిగిందనీ, అందులో భాగంగానే మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్ మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ భూ సేకరణ చేపట్టినట్లు డోబ్రియాల్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నాటి నుండి కొనసాగిన రాష్ట్ర ప్రభుత్వాలతో పరస్పర సంప్రదింపులు జరిపి రాడార్ స్టేషన్ పనులను ముందుకు తీసుకువెళ్ళిందని అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వమే ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకుపోతున్నదనే విషయం అవాస్తవమైనదన్నారు.

## ఆలయం జోలికి పోం..

ఈ ప్రాంతంలో 500 ఏళ్ళుగా కొలువైన వున్న రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని ప్రాజెక్టు భూసేకరణలో భాగంగా తరలిస్తున్నారనే వాదనను డోబ్రియాల్ ఖండించారు. ఈ ప్రాంతంలో 32 ఎకరాల 10 గుంటల్లో విస్తరించిన ఈ దేవాలయంతో పాటు, దేవాలయానికి అనుబంధంగా ఉన్న కొలను అలాగే కొనసాగుతాయనీ, దేవాలయాన్ని సందర్శించే భక్తులకు నేవీ అధికారులు నుండి ఎలాంటి ఇబ్బందులు వుండవని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు జాతీయ ప్రాధాన్యతను కలిగి వుండటంతో పాటు, స్థానిక ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పిస్తుందని డోబ్రియల్ పేర్కొన్నారు. తమిళనాడులోని తిరునల్వేలి తర్వాత రాడార్ స్టేషన్ కలిగి వున్న ప్రాంతంగా, జాతీయ భద్రతను కల్పిస్తున్న కేంద్రంగా తెలంగాణకు ఈ ప్రాజెక్టుతో ప్రత్యేకత చేకూర్చుతుందని డోబ్రియాల్ అన్నారు.



# ప్రతిష్ఠించిన చోటే.. నిమజ్జనం..

- అపూర్వ ఘట్టం.. తిలకించేందుకు భారీగా తరలి వచ్చిన జనం.
- రూ.2,26,116 పలికిన లడ్డూ

**జనపదం, వరంగల్:** వరంగల్ నగరంలోని శ్రీ భద్రకాళీ హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎల్లంబజార్‌లో ప్రతిష్ఠించిన 40 అడుగుల మట్టి గణపతికి ఆదివారం నిమజ్జనం నిర్వహించారు. 15 రోజుల పాటు గణపయ్యకు విశేష పూజలు నిర్వహించారు. చివరి రోజు నిర్వహించిన వేలం పాటలో లడ్డూ రూ.2,26,116 పలికింది. గణపతి ఉత్సవ సమితి సభ్యులు ఫైర్ ఇంజిన్ల సాయంతో వినాయకుడిని ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. స్థానిక పోలీసులు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# పరకాలకు వస్తా..

- కార్యకర్తల బాగోగులు చూస్తా..
- మంత్రి బండి సంజయ్
- నాయకులు, కార్యకర్తల ఘన సత్కారం
- శ్రేణులంతా ఒకే కుటుంబంలా ఐక్యంగా ఉండాలని సూచన



**జనపదం, వరంగల్:** కొద్దిరోజుల్లోనే పరకాల నియోజకవర్గానికి వస్తానని, ఇక్కడి కార్యకర్తల బాగోగులు చూస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని వివిధ కార్యక్రమాలకు వెళ్లి తిరిగి వస్తుండగా పరకాల పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రం రామన్న, పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ శాలువాతో బండిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కొద్ది రోజులలోనే పరకాల వస్తానని, కార్యకర్తల మంచి చెడులు తెలుసుకుంటానని అధైర్య పడొద్దని శ్రేణుల్లో ధైర్యం నింపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఉండాలని ఆయన పార్టీ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి గాజులు నిరంజన్, భాస్కరా చారి, సూర్యదేవర సదానందం, ఆకుల రాంబాబు, మిడిదిడ్డి నరేష్, జనార్ధన్, ఆకుల శ్రీధర్, పాలకుర్తి ప్రతాప్, ముత్యాల దేవందర్, దామ సతీష్, రఘుపతి, సిద్దు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కమాన్ పూర్ లో ఘన స్వాగతం

కేంద్ర మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కు కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వద్ద బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షుడు చందుపట్ల సునీల్ రెడ్డి, నియోజకవర్గ నాయకుడు చల్ల నారాయణ రెడ్డితో పాటు పార్టీ శ్రేణులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమాన్ పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు జంగపల్లి అజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, భూంపెల్లి మొండయ్య, బర్ల సది, వడ్లకొండ తిరుపతి, మల్లారపు అరుణ్, చిప్పకుర్తి సతీష్, జంగపల్లి శ్రీనివాస్, జంగపల్లి స్టెబిస్, కొయ్యడ సతీష్, పంతకాని విశ్వతేజ, సాగర్ల లక్మణస్వామి, మోర ప్రశాంత్, బత్తుల సమ్మయ్య పాల్గొన్నారు.

# రామప్ప ఆలయ పక్కన గుప్త నిధుల తవ్వకాలు..



**జనపదం, వరంగల్:** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం పక్కన ఉన్న గొల్లగుడిలో గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. గుడి పై కప్పును ధ్వంసం చేయడంతో పాటు గుడి లోపల తవ్వకాలు చేపట్టి కొన్ని శిల్పాలను కూడా ధ్వంసం చేశారు. గుడి వద్ద గుర్తు దుండగులు ఉపయో గించిన నిచ్చెనతోపాటు పలు వస్తువులు లభ్యమ య్యాయి. విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న పురావస్తు శాఖ అధికారులు ఆదివారం వెంకటాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# మేడిగడ్డ వద్ద పెరిగిన వరద

**జనపదం, వరంగల్:** ఎగువన కురుస్తున్న వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బరాజ్‌కు వరద స్వల్పంగా పెరిగింది. ఆదివారం 1,06,640 క్యూసెక్కుల ప్రవాహం రాగా, బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత ప్రవాహం రివర్ బెడ్ నుంచి సముద్ర మట్టానికి 90.20 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com